**విలేకరులు కావలెను**

'వజ్రభారతి' తెలుగు దినపత్రిక లో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు, మండలాలకు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు, మండల విలేకరులు కావలెను.

98498 39560

Cell : 98498 39560

RNI.No : APTEL/2021/80994


# వజ్రభారతి

Dare to Write... Dare to fight

vajrabharathi@gmail.com

ఎడిటర్ : వమ్మి ఏడుకొండలు

సామాజిక, రాజకీయ జాతీయ తెలుగు దినపత్రిక




సంపుటి : 5 | సంచిక :94 | ఎడిటర్ : పి.ఏడుకొండలు | వెల : 2 రూపాయిలు | తేదీ: శుక్రవారం 3-4-2026 | పేజీలు : 10 | E-mail:vajrabharathi@gmail.com



## మూలవాసులకు ఎస్‌టీ కేటగిరీ

పరిపాలన, ఆరోగ్యరంగంపై ప్రత్యేక దృష్టి


అస్సాంలో కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేసిన రాహుల్ గాంధీ



## ఏ పేదోడూ ఆఫీసుల చుట్టూ తిరగొద్దు

భూ సమస్యల శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాం

ఇందులో భాగంగానే భూభారతి పోర్టల్ తెచ్చాం: పొంగులేటి



## హైదరాబాద్‌లో పుట్టి పెరిగా.. ఆ రోజు మెడపట్టి గెంటివేశారన్న బాధ ఉంది: నారా లోకేశ్

"ఈరోజు చరిత్రలో నిలబడే రోజు. 5 కోట్ల ఆంధ్రులు గెలిచిన రోజు. అమరావతి రైతులు గెలిచిన రోజు. అమరావతి మహిళలు గెలిచిన రోజు" అని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఢిల్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఆంధ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత మనందరం మద్రాసు రాజధానిగా మద్రాసు స్టేట్ లో ఉన్నామని, దాని తర్వాత పొట్టి శ్రీరాములు చేసిన 58 రోజుల



# 'చట్టబద్ధత'ను ఓర్వలేకే జగన్ డ్రామాలు

- అనేక కుట్రలు దాటుకుని అమరావతికి రక్షణ.. ఇది ప్రజా విజయం
- అమరావతి రైతుల 1631 రోజుల ఉద్యమం ఓ చరిత్ర
- బిల్లును వ్యతిరేకించిన దేశంలోని ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ వైసీపీ
- వాకౌట్ చేసిన ఆ పార్టీని బ్లాకౌట్ చేయాలి
- పార్లమెంటు చట్టం తిరుగులేని శాసనం: సీఎం చంద్రబాబు

అమరావతి: ప్రజా రాజధాని అమరావతి, దాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగాలు శాశ్వతంగా ఉంటాయని, ఇకపై అమరావతిని ఎవరూ టచ్ చేయలేరని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చరిత్ర ఉన్నంత వరకు అమరావతి ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర రాజధానిగా అమరావతికి పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం ద్వారా తిరుగులేని శాసనాన్ని లిఖించారని పేర్కొన్నారు. రాజధాని ప్రాంతంలోని ఉద్దండరాయునిపాలెంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'అమరావతి విజయోత్సవ సభ'లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'అమరావతి బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపిన ఈ రోజు.. ప్రజాస్వామ్య గొప్పతనాన్ని, ప్రజల సంకల్ప బలాన్ని చాటి చెప్పిన రోజు' అని పేర్కొన్నారు. అనేక కుట్రలను దాటుకుని

## యూడీఎఫ్ గ్యారంటీల అమలుపై సందేహాలు వద్దు

# తెలంగాణే 'గ్యారంటీ'!



- ఆ హామీలు ఎలా అమలవుతున్నాయో మా రాష్ట్రం వచ్చి చూడండి
- కేరళలో యూడీఎఫ్ మేనిఫెస్టో ఆవిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి
- అవినీతి, కుటుంబ పాలనలో కేసీఆర్, విజయన్‌ల మధ్య పోలికలు
- కేరళను మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారంటూ విమర్శలు

హైదరాబాద్: కేరళలో యూడీఎఫ్ గ్యారంటీల అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని.. దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూడీఎఫ్ మేనిఫెస్టోపై విమర్శలు చేసేవారు.. ఆ హామీలు తెలంగాణలో ఎలా అమలు అవుతున్నాయో వచ్చి చూడాలని, వాస్తవాలు తెలుసుకోవాలని



# పెద్దల సభలో తెలంగాణ పంచాయితీ

- ఏపీ పునర్‌వ్యవస్థీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా రాజ్యసభలో సవాళ్ల పర్వం
- 'కాళేశ్వరం'పై వ్యాఖ్యలు వెనక్కి తీసుకోండి.. లేదంటే సభా హక్కుల ఉల్లంఘనే: కేఆర్ సురేశ్‌రెడ్డి
- కాళేశ్వరం కేసీఆర్ కుటుంబానికి ఏటీఎంలా మారిందంటూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఫైర్
- పెట్టరా పేరు అమరావతి.. పిలవరా 'కమ్మ'రావతి : ఎంపీ రేణుకాచౌదరి

న్యూఢిల్లీ: రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు2026పై జరిగిన చర్చలో తెలంగాణకు సంబంధించిన పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ చర్చ పార్టీల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది. వివిధ అంశాలపై పార్టీలు పరస్పరం విమర్శలు గుప్పించుకున్నాయి. 'కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయంటూ'కేంద్ర జలశక్తి మంత్రి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి ఒక్క పైసా కూడా తీసుకోకుండా తెలంగాణ ప్రభుత్వం సొంత నిధులతో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై కనీస అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు.



# ఇస్పహాన్, కరాజ్, టెహ్రాన్‌లపై క్షిపణుల వాన

### దాడుల్లో ధ్వంసమైన ఇస్ఫహాన్ సిటీ క్షిపణి నిల్వ కేంద్రం

ఇరాన్ అణ్వాయుధ తయారీ ప్రయత్నాల అంతమే లక్ష్యంగా అమెరికా, ఇజ్రాయెల్ ఆరంభించిన పశ్చిమాసియా యుద్ధం హార్మూజ్ జలసంధి దిగ్బంధంతో కొత్త మలుపు తీసుకుని ఇప్పుడు అతి క్షిపణుల ప్రయోగాలతో మరింత ఉధృతమైంది. దాడులకు ఇరాన్ ప్రతిదాడులతో సమాధానం చెబుతోంది. ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై గురువారం సైతం క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడింది. అగ్రనాయకత్వాన్ని అంతమొందించినా ఇరాన్ తన శక్తిసామర్థ్యాలతో హార్మూజ్‌ను ఇంకా గుప్పిటపట్టి తన ఆధిపత్యాన్ని చాటుకుంటోంది. దీంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బుధవారం జాతినుద్దేశించి ప్రసంగించారు. "గతంలో ఎన్నడూలేనంత భీకరంగా దాడి చేసి హార్మూజ్‌ను మేం హస్తగతం చేసుకోగలం.కానీ అమెరికా ఒంటరిగా అలా చేయాలని అనుకోవట్లేదు.

# త్వరలోనే ఖేల్ ఖతం

- మరో మూడు వారాల్లో ఇరాన్‌పై భీకర దాడులు
- లక్ష్యాలు పూర్తి కావొస్తున్నాయి మా దళాలు పని పూర్తిచేస్తాయి
- ఇరాన్‌ను రాతియుగంలోకి తిరిగి తీసుకెళ్తాం
- జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో డొనాల్డ్ ట్రంప్ స్పష్టీకరణ

వాషింగ్టన్: ఇరాన్‌లో కీలక వ్యూహాత్మక లక్ష్యాలు పూర్తి కావొస్తున్నాయని, తమ సైనిక దళాలు త్వరలోనే అక్కడ పని పూర్తి చేస్తాయని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తేల్చిచెప్పారు. ఇరాన్‌పై జరుగుతున్న యుద్ధాన్ని గట్టిగా సమర్థించారు.



యూడీఎఫ్ గ్యారంటీల అమలుపై సందేహాలు వద్దు

# తెలంగాణే 'గ్యారంటీ'!

సూచించారు. విజయన్, ఆయన మంత్రులు కూడా ప్రత్యక్షంగా వచ్చి పరిశీలించుకోవచ్చని సవాల్ విసిరారు. గురువారం కొచ్చిలో ఐదు ఇందిరమ్మ గ్యారంటీలతో కూడిన యూడీఎఫ్ మేనిఫెస్టోను ఆవిష్కరించిన అనంతరం రేవంత్ మాట్లాడారు.

**అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే, మొదటి కేబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. రుణమాఫీ, రైతు భరోసా, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం గురించి వివరించారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 మేరకు తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని చెప్పారు. తమ రాష్ట్రం వృద్ధిరేటు 10.8%గా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్య మని తాము నిరూపించామని రేవంత్ పేర్కొన్నారు.

**యూడీఎఫ్ స్వర్ణయుగ పాలన ఖాయం**

అవినీతి, కుటుంబ పాలన అంశంలో కేరళ సీఎం పినరయి విజయన్, మాజీ సీఎం కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేరళలో పదేళ్లుగా విజయన్ ప్రభుత్వం కొనసాగుతుంటే 2014 నుంచి సుమారు పదేళ్లపాటు కేసీఆర్ తెలంగాణను పాలించారని చెప్పారు. కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలోనూ ఇద్దరి మధ్య పోలికలు ఉన్నా యన్నారు. దేశాన్ని, కేరళనూ మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ.. విజయన్‌ను ఉద్దేశించి విమర్శించారు. దేవుడి సొంత రాష్ట్రంలో ఆయన ఆస్తికే రక్షణ లేకుండా పోయిందంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని ప్రస్తావించారు. వచ్చే ఎన్నికలతో కేరళలో విజయన్ పాలన ముగిసి యూడీఎఫ్ స్వర్ణ యుగ పాలన మొదలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కేరళ కాంగ్రెస్ నేతలతోపాటు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు.

## ఇస్ఫహాన్, కరాజ్, టెహ్రాన్‌లపై క్షిపణుల వాన

హోర్ముజ్‌పై ఆధారపడిన దేశాలన్నీ ఇప్పటికైనా ధైర్యం కూడదీసుకుని,కలసికట్టుగా రణరంగంలోకి దూకండి. హోర్ముజ్‌ను చేజిక్కించుకోండి"అని పిలుపునిచ్చారు. ఇస్ఫహాన్ సమీప క్షిపణి నిల్వ కేంద్రంపై అమెరికా దాడులుచేసింది. నిల్వకేంద్రంలో భారీగా పేలుళ్లు జరిగాయి. కొన్ని నిమిషాలపాట ఆగకుండా నిల్వకేంద్రం నుంచి పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. కరాజ్, టెహ్రాన్ నగరాలపైనా అమెరికా దాడులను కొనసాగించింది. అమెరికా జరిపిన దాడుల్లో ఇరాన్ మాజీ విదేశాంగ మంత్రి కమల్ ఖరాజీ(81) తీవ్రంగా గాయపడ్డారు. ఆయన భార్య చనిపోయింది. ప్రతిగా ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులను ఉధృతంచేసింది. ఇరాన్ క్షిపణులను కూల్చేపనిలో పడ్డామని ఇజ్రాయెల్ తెలిపింది. బహ్రెయిన్‌లోని అమెరికా 5వ ఫ్లీట్ స్థావరంపై ఇరాన్ దాడులుచేసింది. యూఏఈపై ఇరాన్ డజన్ల కొద్దీ క్షిపణులు, డ్రోన్లను ప్రయోగించింది. వీటిలో 19 క్షిపణులు, 26 డ్రోన్లను నేలమట్టంచేశామని యూఏఈ తెలిపింది. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ దీటుగా స్పందించింది. "అపార ఆయుధ సంపత్తి మా సొంతం. మీరు ఇప్పటిదాకా దాడిచేసినవి మా అసలైన స్థావరాలు కావు. అవి ఎక్కడున్నాయో మీ నిఘా వర్గాలకు కనీసం అవగాహన కూడా లేదు. మాపై ఎంతగా బాంబుల వర్షం కురిపించి నష్టం చేకూర్చినా ఇంకా ఎంతో మందుగుండు, ఆయుధ నిల్వలున్నాయి"అని ఇరాన్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ ఇబ్రహీం జోల్ఫఘరీ అన్నారు.

**70 లక్షల మంది సిద్ధం...**

అమెరికా భూతల దాడులకు దిగితే వారిని మా గడ్డ మీదనే అంతంచేసేందుకు 70 లక్షల మంది ఇరానియన్లు సిద్ధంగా ఉన్నారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ ఖాలీబాఫ్ హెచ్చరించారు. ఇరాన్ జనాభా 9 కోట్లు. దేశభక్తి ఉన్న ప్రతి ఒక్కరూ ఆయుధం పట్టాలని ఇరాన్ ప్రభుత్వం విస్తృతస్థాయిలో ప్రచారంచేస్తోందని వార్తలొచ్చాయి.

## పెద్దల సభలో తెలంగాణ పంచాయితీ

కేంద్ర మంత్రి వ్యాఖ్యలు సభను తప్పుదోవ పట్టించేలా ఉన్నాయని, రికార్డుల నుంచి ఆ వ్యాఖ్యలను తొలగించి క్షమాపణ చెప్పాలని, లేకుంటే సభాహక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని సురేశ్‌రెడ్డి హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత వల్లే మేడిగడ్డ బరాజ్‌లోని రెండు పిల్లర్లు మాత్రమే కుంగాయన్నారు. తెలంగాణకు జాతీయ ప్రాజెక్టు, ఐటీఐఆర్ కారి డార్, స్టీల్ ఫ్యాక్టరీ, మైనింగ్ యూనివర్సిటీలతోపాటు వెనుకబడిన ప్రాంతాలకు రావాల్సిన రూ.900 కోట్ల పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు

బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'భద్రాచలం గ్రామాలను ఏపీలో కలపడం కాంగ్రెస్ రూపొందించిన విభజన చట్టంలోనే ఉంది. అప్పట్లో సోనియాగాంధీతో డిన్నర్ చేసి, ఆమె కాళ్లు పట్టుకున్న కేసీఆర్.. అప్పుడెందుకు ఆ గ్రామాల గురించి అడగలేదు? ఇప్పుడు ఎందుకు మాట్లాడుతున్నారు? కేంద్రం నుంచి పైసా తీసుకోలేదని చెబుతున్నారు. మరి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి కేసీఆర్ దుబాయ్‌లో నోట్లు ఏమైనా ముద్రించారా? అది కేసీఆర్ ఇంట్లో డబ్బు కాదు, ప్రజల డబ్బు. కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే వివిధ ఆర్థిక సంస్థల నుంచి నిధులు వచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఒక ఏటీఎంలా మారిపోయింది. ఎన్నికల ముందు కాళేశ్వరంపై విచారణ జరిపి కేసీఆర్‌ను జైలుకు పంపుతామన్న కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి ఇప్పుడు ఎందుకు ఆ పనిచేయడం లేదు'అని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. పెట్టరా పేరు అమరావతి.. లేకపోతే పిలవరా 'కమ్మ'రావతి అంటూ రాజధాని అమరావతి పేరు చుట్టూ సాగుతున్న రాజకీయాలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రేణుకా చౌదరి తనదైన శైలిలో స్పందించారు. 'అది ఎలాగూ అమరావతే. నేను అప్పటి ముఖ్యమంత్రితో కూడా చెప్పాను.. 'పెట్టరా పేరు అమరావతి.. లేకపోతే పిలవరా పేరు కమ్మరావతి.. పెట్టు పేరు!'అని నేనే అన్నాను. వారికి (కేంద్రానికి) అంత ధైర్యం ఉంటే, చెప్పింది అమలు చేసే సాహసం కూడా చేయమనండి. ఇది కేవలం ఒక కాస్మెటిక్ టచ్ (కంటితుడుపు చర్య) మాత్రమే.'అన్నారు. 'కేంద్ర ప్రభుత్వం ఏపీ పునర్విభజన చట్టాన్ని కేవలం తన మిత్రపక్షాలకు (కూటమికి) మేలు చేసేందుకే వాడుకుంటోంది. అదే చట్టంలో తెలంగాణకు ఇచ్చిన హామీలను మాత్రం ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది'అని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ రేణుకాచౌదరి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. భద్రాచలం సరిహద్దుల్లోని ఏటపాక, కన్నాయిగూడెం, పిచ్చుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె సభలో ఆవేదన వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో పుట్టి పెరిగా.. ఆ రోజు మెడపట్టి గెంటివేశారన్న బాధ ఉంది: నారా లోకేశ్

దీక్ష, ప్రాణత్యాగం వల్ల భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని గుర్తు చేశారు. అందులో భాగంగా కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. మూడేళ్ల తర్వాత ఒక ఒప్పందం వల్ల మళ్లీ తెలంగాణా, ఆంధ్ర కలిపి హైదరాబాద్ రాజధానిగా రాష్ట్రం ఏర్పాటైందని అన్నారు. 58 సంవత్సరాలు కష్టపడి, చెమటోడ్చి అటు తెలంగాణా, ఇటు ఆంధ్రప్రజలు కలసికట్టుగా హైదరాబాద్ ను అభివృద్ధి చేసుకున్నామని, ఒక చీకటిరోజు పార్లమెంటులో ఎలాంటి చర్చ జరగకుండా టీవీలు కట్టేసి, తలుపులు మూసేసి ఆంధ్రరాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించారని విమర్శించారు.

**మెడపట్టి బయటకు గెంటేశారన్న బాధ ఉంది**

ఆనాడు చంద్రబాబునాయుడు ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో రెండు ప్రాంతాలకు న్యాయం చేసి ముందుకు వెళ్లాలని లేకపోతే విభజన వల్ల ఒక ప్రాంతం లబ్ధి పొందినా మరో ప్రాంతం తీవ్రంగా నష్టపోతుంది చెప్పారని గుర్తు చేశారు. అయినా వినకుండా ఏకపక్షంగా ఆంధ్రరాష్ట్రాన్ని విభజించారని ఆరోపించారు. తాను పుట్టిపెరిగింది తెలంగాణాలోనే అని, హైదరాబాద్‌లో ప్రతి గల్లీ తనకు తెలుసు అన్నారు. అయితే ఆరోజున కట్టుబట్టలతో మెడబట్టి బయటకు గెంటేశారన్న బాధ, ఆవేదన కలిగిందని అన్నారు. రాజధాని ఎక్కడ పెట్టాలో తెలియదు, కూర్చునేదానికి సెక్రటేరియట్ లేదు, శాసనసభ సమావేశాలు నిర్వహించుకునేందుకు అసెంబ్లీ లేదు, హైకోర్టు లేదు, పదేళ్లు హైదరాబాద్ మీ రాజధాని, ఆ తర్వాత మీదారి మీరు వెతుక్కోండని విభజన సమయంలో చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు.

**అశాస్త్రీయ రాష్ట్ర విభజన దారుణం**

విభజన ఎంత దారుణంగా జరిగిందంటే షెడ్యూల్ 9, 10 సంస్థలు ఇప్పటికీ అటు తెలంగాణ, ఇటు ఆంధ్ర రాష్ట్రానివో తేలని దుస్థితి నెలకొందని అన్నారు. అశాస్త్రీయంగా జరిగిన విభజన వల్ల ఇప్పుడు కూడా తెలుగు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఆనాడు హైదరాబాద్ లో గల శాసనసభలో ఏపీ అసెంబ్లీ సమావేశం జరిగిందని, ఆ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చాలా స్పష్టంగా అటు ఉత్తరాంధ్రకు, ఇటు రాయలసీమకు సమదూరంలో రాజధాని ఉండాలని చెప్పారని గుర్తు చేశారు. ఆ రాజధాని అమరావతి అని ఆనాడు ప్రకటించారని అన్నారు. ఆ సమయంలో అభివృద్ధి వికేంద్రీకరణ చేసి చూపిస్తామని చెప్పారని, అందులో భాగంగా రైతులు ముందుకొచ్చి భూములు ఇచ్చారని అన్నారు. ప్రధానమంత్రి స్వయంగా వచ్చి అమరావతి పనులకు శంకుస్థాపన చేశారని అన్నారు. ఆనాడు రైతులకు తెలుగుదేశం, బీజేపీ, జనసేన, చివరకు వైసీపీ కూడా భరోసా ఇచ్చాయని గుర్తు చేశారు. అందరూ అమరావతికి సంపూర్ణ మద్దతు తెలిపారని, అందుకే 5 కోట్ల ఆంధ్రుల కోసం తమ భూములు రాజధాని కోసం ఇస్తున్నామని అక్కడి రైతులు చాలా స్పష్టంగా చెప్పారని అన్నారు.

**మూడు ముక్కలాటపై అలుపెరుగని పోరాటం**

పొరపాటున ప్రభుత్వం మారితే అమరావతి రాజధానిగా ఉండదు, తరలిస్తారని తాము 2019 ఎన్నికలకు ముందు చాలా స్పష్టంగా ప్రజలకు చెప్పామని లోకేశ్ తెలిపారు. ఆనాటి ప్రతిపక్షనేత, ప్రస్తుత పులివెందుల ఎమ్మెల్యే జగన్ తాను ఇక్కడే ఇల్లు కట్టుకున్నాను, రాజధానిని ఎక్కడకూ తీసుకెళ్లనని చెప్పి ప్రజలను మోసగించారని ఆరోపించారు. ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిపై అనేక ఆరోపణలు చేసి మూడుముక్కలాట మొదలుపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ రోజు శాసనసభలో తమ ఎమ్మెల్యేలు పోరాడారని, కౌన్సిల్‌లో మాకు మెజారిటీ

# అమరావతి ఇక శాశ్వతం!

అమరావతిని రక్షించుకున్నామని, ప్రజా రాజధానిని సాధించుకున్నామన్నారు. రాష్ట్ర రాజధానికి పార్లమెంటు చట్టబద్ధత కల్పించడాన్ని ప్రజా విజయంగా ఆయన అభివర్ణించారు. అమరావతి ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని పార్టీలు అమరావతికి సహకరించి, దేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజుగా మార్చాయని ఆనందం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఇంకా ఏమన్నారంటే..

"పార్లమెంటులో అమరావతికి తిరుగులేని శాసనం చేసుకున్నాం. పార్లమెంటులో అమరావతి బిల్లు పెడితే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి అండగా నిలబడినా.. ఒకే ఒక్క దిక్కుమాలిన పార్టీ వైసీపీ మాత్రం వ్యతిరేకించింది. ఇంతటి నీతిమాలిన రాజకీయం నా చరిత్రలో చూడలేదు. ఆ పార్టీ నేతలు అమరావతిని శ్మశానం అన్నారు. రాజధానితో మూడు ముక్కలాట ఆడారు. అడ్రస్ లేకుండా పోయారు. అమరావతికి చట్టబద్ధత కల్పించడాన్ని ఓర్వలేని జగన్.. మావిగన్ అంటూ ఓ కొత్త ప్రతిపాదనతో డ్రామాకు తెరలేపారు. తెలుగుజాతి ఆత్మగౌరవం వీరికి పట్టదు. ప్రజలు, రాష్ట్ర భవిష్యత్తు గురించీ పట్టదు. విధ్వంసాలు చేయడం.. విషం చిమ్మడం, ప్రజలను భయభ్రాంతులను చేయడం. అమరావతిని చంపాలనుకున్న ఆ పార్టీకి భవిష్యత్తు లేకుండా చేయాలి. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తుంటే చట్టసభ నుంచి ఆ పార్టీ ఎంపీలు వాకౌట్ చేశారు. ప్రజలు ఆ పార్టీని బ్లాక్ ఔట్ చేయాలి' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

అమరావతి.. ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం

"అమరావతి రైతులు, రైతు కూలీలు, ప్రజల ఐకమత్యం వల్లే ఈ విజయం సాధించుకున్నాం. అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి చిహ్నం అని చాటారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి చీకటి రోజులు దాపురించాయి. ప్రజావేదికతో విధ్వంసాన్ని ప్రారంభించి, అమరావతిని ధ్వంసం చేశారు. దానిని అడ్డుకుంటూ రాజధాని రైతులు, మహిళల వీరత్వం, పోరాటాన్ని ప్రత్యక్షంగా చూశాను. ఉద్యమ శిబిరాలకు నాడు సతీసమేతంగా వచ్చాను. రైతుల ఉద్యమం చూసి



భువనేశ్వరి చలించిపోయారు. ఉద్యమానికి సంఘీభావం తెలిపి చేతికున్న రెండు బంగారు గాజులు ఇచ్చారు. భువనేశ్వరి ఒక్కరే కాదు.. రాష్ట్ర ప్రజలు, దేశవిదేశాల్లో ఉన్న చాలా మంది ఉద్యమానికి అండగా నిలిచారు. న్యాయపోరాటం చేసే స్థోమత కూడా రైతులకు లేదు. ఆనాడు నా దగ్గర డబ్బుల్లేవు. దీంతో అమరావతి ఉద్యమం కోసం నేను స్వయంగా జోలె పట్టాను. మీ ఉద్యమంలో పాల్గొనేందుకు ముళ్ల కంచెలు దాటుకుని పవన్ కల్యాణ్ వచ్చారు. 1631 రోజులు ఉద్యమం ఓ చరిత్ర.. రైతులు చేపట్టిన 'న్యాయస్థానం టు దేవస్థానం' కార్యక్రమాన్ని నాటి పాలకులు అడ్డుకున్నారు. మీ ఉద్యమంపై నాటి ప్రభుత్వ దాష్టీకాన్ని చూసి నేనే మిమ్మల్ని యాత్ర ఆపేయమని కోరాను. మూడు ముక్కలాట చూసిన రాష్ట్ర ప్రజలు.. 2024లో కూటమికి అద్భుత విజయం అందించారు. ఇప్పుడు రాజధానికి చట్టబద్ధత కలిగింది. అమరావతి.. తెలుగు జాతి గుండె, జాతి గౌరవం. ప్రపంచంలోనే అమరావతిని ఉత్తమ నగరంగా తీర్చిదిద్ది జాతికి అంకితం చేస్తాను" అని సీఎం తెలిపారు.

**ప్రపంచం చూసేలా అభివృద్ధి చేస్తాం**

"ఓ ప్రాజెక్టుకు ప్రధాని రెండుసార్లు రావడం అమరావతి పనుల విషయంలోనే జరిగింది. అమరావతి నిర్మాణాలు పూర్తయ్యాక మూడోసారి ప్రధాని అమరావతి వస్తారు. ప్రారంభోత్సవాలు చేస్తారు. అమరావతి శంకుస్థాపన రోజున.. పార్లమెంటు వద్ద ఉన్న పవిత్రమైన మట్టిని, పవిత్ర యమునా నది జలాలను ఇక్కడికి తీసుకొచ్చారు. అలాంటి వాటితో పునీతమైన పవిత్ర భూమి ఇది. దేశమంతా అమరావతికి అండగా ఉంటుందని చెప్పడానికే నాడు ప్రధాని వాటిని తీసుకొచ్చారు. అమరావతి అన్‌స్టాపబుల్.. అద్వితీయం.. అజేయం.. అజరామరం. 1995 నుంచి 2004 వరకు హైదరాబాద్ అభివృద్ధి ఏమిటో ఇప్పుడు ప్రపంచం చూస్తోంది. భవిష్యత్తులో అమరావతి అభివృద్ధిని కూడా ప్రపంచం చూసేలా చేస్తాం" అని పేర్కొన్నారు.

**ఈ విజయం వెనుక ఎన్నో కన్నీళ్లు: మాధవ్**

విజయోత్సవ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ మాట్లాడుతూ.. "అమరావతికి చట్టబద్ధత వెనుక ఎందరో రైతులు, ప్రజల కష్టాలు, కన్నీళ్లు ఉన్నాయి. అరెస్టులు ఎదుర్కొని, ఎన్నో త్యాగాలు చేసి అమరావతిని నిలబెట్టుకున్నారు." అని పేర్కొన్నారు.

# త్వరలోనే ఖేల్ ఖతం

ఉంటుందని స్పష్టంచేశారు. రాబోయే రెండు మూడు వారాల్లో ఇరాన్‌పై భీకర స్థాయిలో దాడులకు దిగబోతున్నామని హెచ్చరించారు. రెండు వారాల్లో యుద్ధం ముగిసిపోవచ్చని సంకేతాలిచ్చారు. శత్రువును ఈసారి గట్టిగా దెబ్బ కొడతామన్నారు. వారిని(ఇరాన్) రాతియుగంలోకి తిరిగి తీసుకెళ్తామని, ఎందుకంటే వారు ఆ యుగానికి చెందినవారేనని వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై యుద్ధంలో తమ జవాన్లు సైతం మరణిస్తున్నారని ట్రంప్ గుర్తుచేశారు అయినప్పటికీ వెనక్కి తగ్గబోమని, చేయాల్సిన పనిని చాలా వేగంగా, కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. లక్ష్యానికి చాలా చేరువలోకి వచ్చేశామని ఉద్ఘాటించారు. అయితే, ఇరాన్‌పై భూతల దాడుల గురించి ట్రంప్ ప్రస్తావించలేదు. నాటో కూటమి తీరుపైనా స్పందించలేదు. నాటో దేశాలు తమకు సహకరించడం లేదని ఆయన కొన్నిరోజులుగా అసంతృప్తి వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే. ఇరాన్‌తో చర్చల గురించి కూడా మాట్లాడలేదు. ట్రంప్ తన ప్రసంగంలో ఇంకా ఏం చ్పారంటే.. "అమెరికా సైన్యం గతంలో ఎన్నో యుద్ధాల్లో పోరాటం సాగించింది. ఇరాన్‌పై పోరు 32 రోజులకు చేరింది. ఈ యుద్ధం ముగించడానికి కొంత సమయం పడుతుంది. రెండు ప్రపంచ యుద్ధాలు, కొరియా, వియత్నాం, ఇరాక్ యుద్ధాలు సంవత్సరాలపాటు కొనసాగాయి. ఇరాక్ యుద్ధభూమిలో అమెరికా సాయుధ బలగాలు వేగవంతమైన, నిర్ణయాత్మకమైన, తిరుగులేని విజయాలు సాధించాయి. అమెరికా సైనిక చర్య చాలా శక్తివంతమైనది, అద్భుతమైనది. అమెరికా అత్యంత శక్తివంతమైన దేశం అనే సంగతి మర్చిపోవద్దు. ఇరాన్‌లోని యురేనియం స్వాధీనం చేసుకోవడానికే ఈ యుద్ధం ప్రారంభించామన్న వాదనలో నిజం లేదు. ఇరాన్ అణు కేంద్రాలను చాలావరకు ధ్వంసం చేశాం. అక్కడున్న అణు ధూళి దగ్గరికి చేరడానికి కొన్ని నెలల సమయం పడుతుంది. ఇరాన్ అణు కార్యక్రమాలపై ఉపగ్రహాలతో నిఘా కొనసాగుతుంది. మరోసారి అణ్వస్త్రాల ఆలోచన చేస్తే క్షిపణులతో చావుదెబ్బ కొడతాం. హోర్ముజ్ విషయంలో ప్రపంచదేశాలు ఇప్పటిదాకా వాయిదా వేసుకున్న ధైర్యాన్ని కూడగట్టుకోవాలి. వెంటనే వెళ్లి ఆ జలసంధిని చేజిక్కించుకోవాలి. ఈ యుద్ధం.. భవిష్యత్ తరాల కోసం పెట్టుబడి నా అధ్యక్ష పదవీకాలంలో గత ఐదేళ్లుగా అమెరికా విజయాలు సాధిస్తూనే ఉంది. ఇప్పుడు మునుపెన్నడూ లేనట్టి ఘన విజయం సాధించబోతున్నాం. అమెరికాతోపాటు ప్రపంచ భద్రత కోసమే ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ ప్రారంభించాం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండడానికి ఎంతమాత్రం వీల్లేదు. అలాంటి ఆయుధాలు ఉండడం మనకు భరించలేని ముప్పు అవుతుంది. గత ఏడాది ఇరాన్ అణు కేంద్రాలను ధ్వంసం చేశాం. అయినా సరే అక్కడ అణ్వాయుధ కార్యకలాపాలు ఆగడం లేదు. మరోచోట అణు కేంద్రాలు నిర్మించాలని చూస్తున్నారు. అణ్వాయుధాలపై ఇరాన్‌కు ఆశలు చావడం లేదు. నేరుగా అమెరికా భూభాగంపై దాడిచేసేలా బాలిస్టిక్ క్షిపణులను ఇరాన్ తయారు చేస్తోంది. ఇరాన్‌పై యుద్ధంతో అమెరికాకు తప్పనిసరిగా మేలు జరుగుతుంది. అమెరికా మరింత మెరుగైన స్థితిలో ఉంటుంది. ఇది మీ పిల్లలు, మీ మనవళ్ల భవిష్యత్తు కోసం పెడుతున్న నిజమైన పెట్టుబడి"అని ట్రంప్ తమ దేశ పౌరులకు తేల్చిచెప్పారు.

ఇరాన్‌పై యుద్ధం కొనసాగించడానికి అమెరికా ప్రజలకు ఓపిక ఉందో లేదో తనకు తెలియదని ట్రంప్ అన్నారు. బుధవారం వైట్‌హౌస్‌లో ఈస్టర్ విందు కార్యక్రమంలో అతిథులతో ఆయన ముచ్చటించారు. ఇరాన్ చమురును అత్యంత సులభంగా స్వాధీనం చేసుకోగల సత్తా అమెరికాకు ఉందని చెప్పారు. కానీ, అలాంటి ప్రయత్నం పట్ల అమెరికన్లలో తగినంత సహనం ఉన్నట్లు కనిపించకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు.



## గండేపల్లిలో సామాజిక పెన్షన్ల పంపిణీ

### గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ చేతుల మీదుగా పంపిణీ

**గండేపల్లి,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, ఏప్రిల్, 02:-** మండల కేంద్రం గండేపల్లి గ్రామంలో సామాజిక పెన్షన్లను గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ పంపిణీ చేశారు.గ్రామంలో ఇటీవల మరణించిన రెడ్డి మహేష్‌కు సంబంధించిన పెన్షన్‌ను ఆయన భార్య మంగకు, పాలిశెట్టి అప్పారావుకు సంబంధించిన పెన్షన్‌ను ఆయన భార్య సరస్వతికి, అలాగే కండెల్లి నాగేశ్వరావు (రాజు)కు సంబంధించిన పెన్షన్‌ను ఆయన భార్య పాపకు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లంరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందనే దానికి సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమమే నిదర్శనమని తెలిపారు. భర్త మరణించిన తరువాత వచ్చే నెల నుంచే భార్యకు పెన్షన్ అందించడం ద్వారా ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆదరణ కూటమి ప్రభుత్వానికి లభిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, పెనుగాడి నాగరాజు, సనుమూరి అప్పారావు, సచివాలయ సిబ్బంది రాజీ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తండ్రి నరశింహరాజు మృతికి...

### సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు సంతాపం...



**యండగండి, వజ్రభారతి, ఏప్రిల్ 2:** మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తండ్రి నరశింహ రాజు మృతి పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. గురువారం యండగండిలోని శ్రీరంగ నాథరాజు నివాసానికి వెళ్లిన కోనాల భీమారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్ తో కలిసి వారి కుటుంబ సభ్యులను పరామర్శిం చారు.ఈ సందర్భంగా నరశింహ రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీరంగనాథరాజుతో మాట్లాడి, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నరశింహ రాజు మరణం ఆ కుటుంబానికి తీరని లోటుగా పేర్కొంటూ నివాళులర్పిచారు.

# రీసర్వే పనులు పారదర్శకంగా నిర్వహించాలి

### గౌనివారిపల్లిలో రీసర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్



గోరంట్ల,వజ్ర భారతి ఏప్రిల్ 02:- రీసర్వే పనులను పారదర్శకంగా నిర్వహించాలని శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ అధికారులకు సూచించారు. గోరంట్ల మండల పరిధిలోని గౌనివారిపల్లి గ్రామంలో,రీసర్వేలో జరుగుతున్న గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నంబర్లు 136 నుండి 140 వరకు ఉన్న 40 ఖాతాలకు సంబంధించిన భూమిని,రెవెన్యూ రికార్డులతో సరిపోల్చి పరిశీలించారు.పరిశీలన సమయంలో హాజరైన రైతులతో కలెక్టర్ మాట్లాడి,వారికి నోటీసులు సకాలంలో అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు.గ్రౌండ్ ట్రూతింగ్ ప్రక్రియలో రైతుల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ, నోటీసు అందిన రోజున తప్పనిసరిగా భూమి వద్ద హాజరై, సర్వే బృందానికి తమ భూమి హద్దులు చూపించాలని సూచించారు.దీనివల్ల ఎలాంటి పొరపాట్లు లేకుండా రీసర్వే రికార్డులు సిద్ధమవుతాయని తెలిపారు.ఈ రీసర్వే ప్రక్రియలో సాంకేతిక పద్ధతులు,రోవర్స్ మరియు ఓఆర్ఎస్ నెట్‌వర్క్ ద్వారా ఖచ్చితమైన భూసరిహద్దులు నమోదు చేయబడుతున్నాయని తెలిపారు.అలాగే రీసర్వే పూర్తయిన తర్వాత,భూముల ఖచ్చితమైన హద్దులు స్పష్టంగా రెవిన్యూ రికార్డులు నమోదు అవుతాయని, దీని ద్వారా భూ వివాదాలు గణనీయంగా తగ్గుతాయని, రికార్డులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయని భూమి కొనుగోలు,అమ్మకాలలో పారదర్శకత పెరుగుతుందని తెలియజేశారు.రీసర్వే సిబ్బందితో మాట్లాడుతూ.... ప్రతి రైతుకు సమయానికి నోటీసులు అందేలా చర్యలు తీసుకోవాలని,రైతులు హాజరయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.గ్రామ రెవెన్యూ అధికారులు,గ్రామ సహాయకులు టామ్‌టామ్ ద్వారా రీసర్వే పై విస్తృత ప్రచారం చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.రీసర్వే,రెవెన్యూ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి,రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జాయింట్ ఎల్పిఎంఎస్ నమోదు చేయకుండా,సర్వే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రైతులు కూడా సర్వే సమయంలో హాజరై సరైన సమాచారం అందిస్తే, జాయింట్ ఎల్పిఎంఎస్ సమస్యలు తగ్గుతాయని,తద్వారా ప్రభుత్వ పథకాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా పొందగలుగుతారని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు,జిల్లా సర్వే భూమి రికార్డుల అధికారి పి.విజయశాంతి బాయి,రెవెన్యూ డివిజనల్ అధికారి టి.ఆనంద కుమార్,డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే పెనుకొండ,గోరంట్ల మధు నాయక్,మండల సర్వేయర్,గ్రామ రెవెన్యూ అధికారులు,గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ వర్తించాలి

### జిల్లా కలెక్టర్ కు బహుజన్ సమాజ్ పార్టీ వినతి పత్రం ఇవ్వడం జరిగింది



**కాకినాడ,వజ్రభారతి,ప్రతినిధి,స్టేట్ బ్యూరో,ఏప్రిల్, 2:-** కాకినాడ జిల్లా ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మాతా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఈరోజు కలెక్టర్ కార్యాలయం ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల భారత సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ను కేంద్ర ప్రభుత్వం పరిశీలన చేయాలని ఇక దళితుడు ఏ మతం స్వీకరించిన సమాజం తనను చూసి దృష్టి కోణం మారదు గనుక రాజ్యాంగం ప్రకారం మనిషి ఏ మతమైనా పాటించవచ్చు కనుక గతంలో 1956లో సిక్కు మతం స్వీకరించిన దళితులకు 1990లో బౌద్ధ మతం స్వీకరించినటువంటి దళితులకు ఏ విధంగా రిజర్వేషన్ సౌకర్యాలు కల్పించారు అదేవిధంగా క్రైస్తవ మతం స్వీకరించిన దళితులకు కూడా ఆ సౌకర్యం వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వానికి అదే విధంగా రాష్ట్ర సుప్రీంకోర్టులో ప్రభుత్వం తరఫున రివిజన్ పిటిషన్ దాఖలు చేయాలని తమ ద్వారా డిమాండ్ చేస్తున్నాము అలాగే పశ్చిమగోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం ఆకివీడు గ్రామం పెద్దపేటలో వివాదాస్పద ప్రాంతం లో గతంలో అక్కడ గోశీతెలమ్మ పండుగ చేసుకునేవారు గనుక ఆ గ్రామ ఎస్సీ మాల కులాల వారి మనోభావాలు దెబ్బతిన్నాయి అలాగే అక్కడ 30 మంది దళితులపై అక్రమంగా కేసులు బనాయించి వారిపై ఎఫ్ఐఆర్ కట్టి జైలుకు పంపించడం జరిగింది. కనుక వారందరినీ తక్షణం ఆ కేసులను ఎత్తివేయాలని విరుపక్షాలపై కేసులు నమోదు చేసి న్యాయ విచారణ జరిపించాలని ఎవరైతే అక్కడ ఉండి నియోజకవర్గ ఎమ్మెల్యే దళితులను నీచాతి నీచంగా వారిపై దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారో అటువంటి వారిపై తగు చర్యలు తీసుకుని ఉపసభాపతిగా ఉన్న ఆయనను ఆ పదవి నుండి సస్పెండ్ చేయాలని ఈ రాష్ట్రంలో మతకల్లోలకు ఇటువంటి వారు పునుగులుతూ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆ ప్రాంతంలో హిందువులు, క్రైస్తవులు ,ముస్లిం లు, సిక్కులు అందరూ అన్నదమ్ముల వలె ఇప్పటివరకు కలిసిమెలిసి ఉండే వారిని ఇటువంటి వారికి పదవి రావడం వలన లేనిపోని మత విద్వేషాలు రెచ్చగొడుతూ అమాయకులైనటువంటి మా మధ్య మతమనే దానిని తీసుకువచ్చి అన్నదమ్ములుగా ఉండేటువంటి మా మధ్య గొడవలు రేపుతున్నారని ఇటువంటి వారికి గౌరవనీయమైన సభా ఉభాపతి పదవి తగదని బహు బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు అలాగే కాకినాడ జిల్లాలో ఉన్నటువంటి ప్రతి అసెంబ్లీ కన్వీనర్లు మండల నాయకులు గ్రామ నాయకులు అందరూ ఈరోజు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఇటువంటి వారిపై తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కేడర్ అంతా పాల్గొని ఉన్నారు

# ఆకివీడు ఘటనపై హైకోర్టు సిట్టింగ్

### జడ్జితో న్యాయవిచారణ జరిపించాలి.

### సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్.

### ప్రశాంతమైన పశ్చిమగోదావరి జిల్లాలో కుల మతాల మధ్య గొడవలు రావడం విచారకరం.

### కోర్టు ద్వారా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.



**భీమవరం, వజ్రభారతి, ఏప్రిల్ 2:** ఆకివీడు పెదపేటలో పురాతన ఆలయ వివాదం నేపథ్యంలో చోటుచేసుకున్న ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయవిచారణ జరిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.గురువారం భీమవరంలోని జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవిన్యూ ధికారి బి.శివన్నారాయణ రెడ్డి ని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన ఆలయంపై రెండు వర్గాల మధ్య భిన్నమైన వాదనలు వున్నప్పుడు, ఎమ్మెల్యే కె.రఘురామకృష్ణంరాజు ఒక ప్రజాప్రతినిధిగా అందరితో చర్చించి శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలి.అలా కాకుండా ఆయనే వివాదానికి కేంద్రబిందువుగా మారడం దురదృష్టకరమన్నారు.గ్రామంలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పుడు పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సింది పోయి, కేవలం ఒక వర్గానికి చెందిన 58 మందిపై కేసులు పెట్టి అరెస్ట్ చేయడం వారి ఏకపక్ష ధోరణికి నిదర్శనంగా వుందన్నారు.న్యాయవిచారణ జరగకుండా ఒక వర్గం వారు పెట్టిన కేసు పరిగణన లోకి తీసుకుని అక్రమంగా అరెస్ట్ చేసిన 58 మందిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని,విచారణ అనంతరం ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.ప్రశాంతతకు మారుపేరైన పశ్చిమ గోదావరి జిల్లాలో కుల,మత విద్వేషాలు పెరగడం ఆందోళనకరమన్నారు.ఆకివీడులో తక్షణమే శాంతి కమిటీలను ఏర్పాటు చేసి పరిస్థితులు అదుపు తప్పకుండా చూడాలని కోరారు.వివాదాస్పదంగా మారిన ఆ పురాతన ఆలయం ఎవరికి చెందుతుందనేది న్యాయస్థానాలే నిగ్గు తేల్చాలన్నారు.అప్పటి వరకు ఇరువర్గాలు సంయమనం పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని,బాధ్యత లేకుండా రెచ్చగొట్టే ధోరణితో వ్యవహరిస్తూ అశాంతికి ఆజ్యం పోసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,జ్యుడీషియల్ విచారణ ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలన్నారు.న్యాయస్థానాలు ఇచ్చే తీర్పుకు అందరూ కట్టుబడి ఉండేలా చూడాలని భీమారావు డిఆర్‌ఓకు విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

## రోజూ నడకను అలవాటు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు




### పి ఎమ్ పి మండల శాఖ అధ్యక్షులు పి చిన్ని

**గోకవరం, వజ్రభారతి ఏప్రియల్ 02:-- (చిక్కిరెడ్డి వీరబాబు ):** ప్రతిరోజు నడవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్ గోకవరం మండలశాఖ అధ్యక్షులు మరియు జిల్లాకోశాధికారి పి చిన్ని అన్నారు. నేషనల్ వాకింగ్ డే సందర్భంగా కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ (ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) గోకవరం మండలం ఆధ్వర్యంలో బుధవారం గోకవరం లో మోర్నింగ్ వాక్ ప్రోగ్రాం నిర్వహించారు.ఈ ప్రోగ్రామ్ లో రహదారి పై వెళ్ళే పాదచారులకు నడకపై అవగాహన కల్పిస్తూ ప్రతి రోజూ నడకను అలవాటు చేసుకోవడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని,మధుమేహం, క్యాన్సర్ వంటి జబ్బులను నివారించవచ్చని,దీని ద్వారా మానసిక ఒత్తిడి తగ్గి మెదడు చురుగ్గా పనిచేస్తుందని కనుక ప్రతి ఒక్కరూ రోజూ 30-60 నిమిషాలు నడక సాగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, జిల్లా కోశాధికారి పి చిన్ని,మండల కార్యదర్శి ఎస్. సూరిబాబు,కోశాధికారి జి.లాజర్, వైస్ ప్రెసిడెంట్స్ ఎమ్. నాగేశ్వరావు, జి నాని, సహాయ కార్యదర్శిలు జి. వెంకటేష్,జె మూర్తి,ఐ నాగేశ్వరావు, గోకవరం మండల అసోసియేషన్ సభ్యులు టి.ఆంజనేయులు,జె శర్మ,కె జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## అభిషిక్తుని అమరత్వం...!

పేదలను ప్రేమించిన పాపాత్ముడు...
దుర్భోధలు చేసిన దుర్మార్గుడు...
లొంగిపోయెనని ఆ లోకరక్షకుడు...
లోలోన పొంగిపోయెను ప్రతిరాక్షసుడు...

పాపాంధ కారాన్ని పారద్రోలడం...
రోగుల రుగ్మతలను రూపుమాపడం...
లోకరక్షకునిలోని లోపాలనడం...
జ్ఞానరాహిత్యానికి గొప్పతార్కాణం...


పాపమెరుగని పరమ పావనుడని...
కోపం క్రోధం రాని కరుణామయుడని...
దోషం ద్వేషం లేని దయాసముద్రుడని...
దివి నుండి దిగి వచ్చిన దీనజన బాంధవుడని...
పాపుల రక్షకుడని...

ఆయన హృదయం అనురాగ భరితమని..
జాలె ఎదలో ప్రవహించు జలపాతమని...
పేదలకు పంచెను ప్రేమామృతమని...
సహనానికి శాంతికి క్రీస్తె సంకేతమని...

పరిపరి విధముల
ప్రభువును ప్రశంసించిన పిమ్మట
నిరపరాధియని పిలాతు నిరూపించెనట..

అంతట...కేకలేశారట
కర్ణకఠోరంగ కాకుల్లాగ...
పరమ పవిత్రుడైన
వరపుత్రున్ని వధించమని...
వీడించారట పిలాతును పిశాచుల్లాగ...
బందిపోటు బరబ్బాను బ్రతికించమని...


అల్లిపెట్టిరట తలపై ముళ్ళకిరీటం...
పెల్లుబికెనట ప్రభువులో ఆరాటం...
నిర్దోషిపై మోపిరట నీలాప నిందలు...
గొల్లుమని నవ్వెనట గొర్రెల మందలు...




మరియసుతుని మేనుపైన
కొరడాలు ఝులిపించిరట
ఆ క్రూరులంత...
కరుణగారె కరములందు
మరమేకులు మొలిపించిరట
ఆ మూర్ఖులంత...

పులినోట చిక్కిన లేడిలా...
అల్లాడి అల్లాడి అలమటించెనట...
బలిపీఠమెక్కిన పశువులా...
వ్రేలాడి వ్రేలాడి విలపించెనట...

పరిహసించిరట ప్రక్కలో బల్లెంచెక్కి..
వికటాట్టహాసం చేసిరట విషం వెళ్ళగ్రక్కి..
చిత్రహింసలకు గురియాయెనట...
ప్రభువు సిలువపైకెక్కి..
అసువుల నర్పించెనట
ఆ పశువుల చేజిక్కి..




అశ్రుధారలు రాలుస్తు...
మృత్యువు కోరలు చీలుస్తు...
ఆత్మను తండ్రికి అందిస్తు...
అందరిని క్షమించమని క్రీస్తు...
కమ్మగా పలికెనట
కలువరిగిరిపై కళ్ళుమూస్తు...

అభిషిక్తుడు అస్తమించగానే అంధకారం
అలముకుందట...ఆకాశమంత
ప్రభువు పవిత్రరుధిరం ప్రవహించగానె
పకపక నవ్విందట...పాతాళమంత

కృంగెనట క్రీస్తు శిరస్సు...
పొంగెనట శాంతి సరస్సు...
తరగిపోయెనట నరుల పాపతపస్సు...
కరిగిపోయెనట యూదుల క్రూరమనస్సు
పిలిచిందట ప్రభువును సురలోక సదస్సు.

ఔను...ఔను
అద్భుతం అద్భుతం...
అద్వితీయం అపురూపం
అభిషిక్తుని అమరత్వం...
ఔను...ఔను...
ప్రభు యేసు చరణం...
ఇక ప్రతి పాపికి శరణం....

**(ఈస్టర్ పండుగ సందర్భంగా కవిత)....**



రచన:
కవిరత్న
సాహిత్య ధీర
సహస్ర కవి
భూషణ్
పోలయ్య
కూకట్లపల్లి
అత్తాపూర్
హైదరాబాద్







# ఉత్సాహంగా వీడ్కోల సభ

**తణుకు, వజ్రభారతి, ఏప్రిల్ 2:** యస్.కె.యస్.డి. మహిళా డిగ్రీ అండ్ పీజీ (అటానమస్) కళాశాలలో ఉత్సాహంగా ఉల్లాసంగా కేరింతలు కరతళాల ధ్వనుల మధ్య వీడ్కోలు సభ ఘనంగా జరిగింది. జూనియర్ విద్యార్థినులు సీనియర్ విద్యార్థినులకు ఉత్సాహంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు. లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ జీవితంలో ఎన్నో సమస్యలు ఎదురౌతాయని వాటిని అధిగమించి ముందుకు వెళ్ళాలని డిగ్రీతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదవాలని, అలాగే తమ విద్యార్థులు ఐబిఎమ్, ఐసిఐసిఐ వంటి ఉద్యోగాలలో క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ అయ్యారని, ఎన్.ఎస్.ఎస్. మరియు ఎన్.సి.సి విద్యార్థినుల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో అనేక శిభిరాలు ఏర్పాటు చేస్తున్నామని 1350 మంది విద్యార్థినులకు నాంది ఫౌండేషన్, ఎపిఎస్ఎస్ సి, ఉన్నతి ఫౌండేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలకు తోట్పడే శిక్షణ కార్యక్రమాలు ఏర్పాట చేశామని, 50 శాతం పైగా విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయ్యారని వార్షిక నివేదికను తెలియజేసారు.

**ముఖ్య అతిధిగా డా॥ దేవళ్ళ శ్రీహరి (డెంటిస్ట్) శ్రీ స్మైల్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పటల్**

తణుకు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదవాలని కుటుంబ వ్యవస్థ బాగుండాలని ప్రతీ విద్యార్థి పాజిటివ్ ధృక్పదం అలవర్చుకోవాలని, సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని, చదువుతోపాటు సంస్కృతి, సాంప్రదాయాలు ఆచరించాలని విద్యార్థులు జీవితంలో విజయం సాధిస్తే అదే అధ్యాపకులకు ఇచ్చే గురుదక్షిణ అవుతుందని, మన జీవితాన్ని మనమే నిర్మించుకోవాలని, నోటి సంరక్షణ గురించి మాట్లాడుతూ రోజుకు రెండుసార్లు బ్రెష్ చేసుకోవాలని, ఆహారం తిన్న తరువాత పుక్కిలించి ఊసేయాలని, ప్రతీ ఆరు నెలలకు ఒకసారి దంత వైద్యులను సంప్రదించాలని తెలియజేశారు.

### కళాశాల ప్రెసిడెంట్ కె.వి. సుబ్బారావు మాట్లాడుతూ మీకు నచ్చిన రంగంలో విజయం

సాధించాలని, స్త్రీ అన్ని రంగాలలో ఉన్నత స్థానంలో ఉన్నారని, ఆర్థికంగా ఎవరి మీద ఆధారపడకుండా స్వతంత్రంగా ఉండాలని, సోషల్ మీడియా వంటి వాటికి దూరంగా ఉండాలని, ఎక్కడెక్కడో నుండి విద్యార్థినులు వచ్చి చదువుకుంటారని, సరదాలు, జ్ఞాపకాలు ఎప్పుడూ మనసులో ఉండాలని ఈ సందర్భంగా విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కళాశాల వార్సికోత్సవం పురస్కరించుకొని విద్యార్థినులకు పలు క్రీడా కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నీస్, బాస్కెట్బాల్, వాలీబాల్, ఖోఖో వీరికి బహుమతి ప్రధానం చేసినారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకొన్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థిని సంఘం సభ్యులు కె. పద్మాజరాణి, వివిధ కళాశాలల ప్రధానాచార్యులు, ఫిజికల్ డైరెక్టర్ ఎం. రత్నకుమారి, అధ్యాపక, అధ్యాపకేతరి సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

# అమరావతి రాజధానికి చట్టబద్ధత పట్ల సంబరాలు







**తణుకు, వజ్రభారతి, ఏప్రిల్ 02:** అమరావతి రాజధానికి లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం లభించడం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలు మేరకు గురువారం తణుకు పట్టణంలోని స్థానిక నరేంద్ర సెంటర్‌లో కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించారు. కేకు కట్ చేసి బాణాసంచా కాల్చి స్వీట్లు పంచి వేడుకలు చేశారు. అనంతరం నరేంద్ర సెంటర్ నుంచి అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ చేసి అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఇరగవరం, అత్తిలి మండలాల కేంద్రాల్లో సైతం ఈ వేడుకలు చేపట్టారు. ఆరుకోట్ల రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో అమరావతి రాజధాని బిల్లుకు చట్టబద్ధత కల్పించే విధంగా కృషి చేయడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజధాని ప్రాంతాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిన జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణ యోగ్యం కాని మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. తాజాగా మరోసారి మావిగన్ పేరుతో రాజధాని ఏర్పాటు చేయాలంటూ జగన్ చేసిన ప్రకటనలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడును నమ్మి వేలాది మంది రైతులు ముందుకు వచ్చి వ్యవసాయ భూములు ఇచ్చారని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అమరావతి రాజధాని బిల్లును అటు లోక్‌సభ, ఇటు రాజ్యసభలో ఆమోదయోగ్యం కావడానికి కృషి చేసిన తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇరగవరం కాలనీలో అభివృద్ధి శూన్యం

**స్మశాన వాటిక అభివృద్ధి విషయంలో అబద్ధపు ఆరోపణలు.**

**ఆరోపణలు చేసేవారు కూడా స్మశాన వాటిక అభివృద్ధికి సంతకాలు చేశారు.**

**అభివృద్ధి చేయకపోగా దళిత నాయకులతో ఆరోపణలు చేయిస్తున్నారు.**



**తణుకు, వజ్రభారతి, ఏప్రిల్ 2:** ఇరగవరం కాలనీలోని ఉన్న దళిత ప్రాంతానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మొండిచెయ్యి చూపించిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ తణుకు పట్టణ అధ్యక్షుడు పెనుమాల రాజేష్ అన్నారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలనీలో ఎటువంటి అభివృద్ధి చేయకపోగా దళిత వర్గానికి చెందిన కొందరు మా సోదరులను టీడీపీ కార్యాలయంలో కూర్చోబెట్టి మాపై దుష్ప్రచారం చేయిస్తున్నారని అన్నారు. మాకు వ్యతిరేకంగా టీడీపీ నేతలు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను మా దళిత సోదరులచే చదివించి ఆ వీడియోలను విడుదల చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దళితులకు సంబంధించిన స్మశానవాటిక సరిపోకపోవడంతో అభివృద్ధి చేసుకోవాలనే ఉద్దేశ్యంతో సంఘం ఆధ్వర్యంలో తీర్మానం చేసి స్మశానాన్ని శుభ్రం చేసుకుంటుంటే జరిగిన వ్యవహారంలో చెట్లు అమ్ముకున్నారని, నిరసన చేశారంటూ కేసులు నమోదుచేయడం ఎంతవరకు సబబని అన్నారు. టీడీపీ కార్యాలయంలో కూర్చుని మాట్లాడిన దళిత సోదరుల్లో కొందరు ఆ తీర్మానంలో సంతకాలు చేశారనే విషయాన్ని మరచిపోవద్దని గుర్తుచేశారు. చెట్ల దుంగలు చోరీ చేశామని అపవాదులు వేస్తున్నారని కానీ ఆ దుంగలను మునిసిపాలిటీ అధికారులు జేసీబీ ద్వారా ట్రాక్టరులోకి ఎక్కించి కొమ్మాయిచెర్వు ప్రాంతంలో ఉంచిన విషయం తెలుసుకోకపోవడం శోచనీయమని అన్నారు. దళితుల మధ్య చిచ్చుపెట్టే విధంగా తణుకులో టీడీపీ నేతలు కుతంత్రాలు చేస్తున్నారని టీడీపీ వర్గానికి కొమ్ము కాస్తున్న దళిత సోదరులు ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా అన్న చంద్రబాబు వర్గానికి కొమ్ముకాయడం సిగ్గుచేటని, వారికి బానిసలుగా బతకడం మన దౌర్భాగ్యమన్నారు.

**కారుమూరి హయాంలోనే కమ్యూనిటీ హాలు..**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ రెండేళ్ల కాలంలో కాలనీలోని దళిత ప్రాంతానికి ఏం చేశారని నిలదీశారు. దళితులు వివాహాలు, శుభకార్యాలు చేసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నామని అప్పట్లో ప్రస్తుత మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగానే సుమారు రూ. 50 లక్షల వ్యయంతో భారీఎత్తున కమ్యూనిటీ హాలు నిర్మాణం చేసి ప్రారంభించారని అన్నారు. దళిత వర్గంలో ప్రతి ఇంటి లక్షలాది రూపాయిల లబ్ది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అందిందని నేడు ఏ ఒక్క సాయం కూడా దళితులకు అందడంలేదని విమర్శించారు. దళిత ప్రాంతంలో అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో అందరికీ తెలిసిందేనని చర్చకు తాము సిద్దమేనని అన్నారు. సంపన్నుల ఇళ్లు ఉండే ప్రాంతాల్లో మాత్రమే రోడ్లు అభివృద్ధి చేస్తున్నారని, దళితులు ఉండే ప్రాంతంలో రోడ్లు మాత్రం గుంతలతోనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో 13వ వార్డుకు చెందిన దళిత నాయకులు వల్లూరి బుజ్జిబాబు, పాల నిర్మల, పడాల బాలు, రొక్కాల రాము, బంటు వినయ్‌కుమార్, సరెళ్ల సోమశేఖర్, నేలపాటి రాంబాబు పాల్గొన్నారు.




# పరుపులు, రగ్గులు పంపిణీ చేసిన ఆమెన్ ట్రస్ట్!

**నల్లజర్ల, వజ్రభారతి, ఏప్రిల్ 2:** నల్లజర్ల ఆనందనిలయం హాస్టల్ విద్యార్థులకు స్వచ్ఛంద సేవా సంస్థ 'ఆమెన్ ట్రస్ట్' పరుపులు, రగ్గులు పంపిణీ చేసి అందరి ప్రశంసలు అందుకుంది. గురువారం హాస్టల్ ఆవరణలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.వి.ఎస్.సత్యనారాయణ ముఖ్య అతిధిగా పాల్గొని విద్యార్థులకు పరుపులు పంపిణీ చేశారు. హాస్టల్ విద్యార్థులకు పడుకోడానికి సరైన సౌకర్యం లేని దీనావస్థ దుస్థితిని గమనించిన సేవాసంస్థ ఆమెన్ ట్రస్ట్ వారు స్వచ్ఛంధంగా ముందుకొచ్చి పరుపులు, రగ్గులు పంపిణీ చేయడం అభినందనీయమని ఎం.పి.డీ.ఓ ప్రసంశించారు. విద్య, వైద్యం కోసం ఆమెన్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అపూర్వమని కార్యక్రమంలో పాల్గొన్న నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు అన్నారు. హాస్టల్ విద్యార్థుల కష్టాన్ని అర్ధం చేసుకొని వితరణతో కదిలిన ఆమెన్ ట్రస్ట్ ఆదర్శంగా సేవా సంస్థలు ముందుకు రావాలని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీ.వీ.వీ.ప్రసాద్ ఆకాంక్షించారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ అశోక్ మాట్లాడుతూ, ఉన్నంతలో సేవ చేయడమే ధర్మంగా తమ సంస్థ పనిచేస్తుందని, అందులోభాగంగానే నల్లజర్ల హాస్టల్ విద్యార్థులు పడుకోడానికి పడుతున్న ఇబ్బంది తెలుసుకుని పరుపులు, రగ్గులు అందజేయడం జరిగిందన్నారు. తమ విద్యార్థులకోసం సాయం చేసిన ఆమెన్ ట్రస్ట్ నిర్వాహకులకు హాస్టల్ వార్డెన్ ధర్మరాజు కృతజ్ఞతలు తెలియజేసారు.



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమరావతి రాజధాని చట్టబద్ధత కోసం మార్చి 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రానికి శాశ్వత అమరావతి రాజధానిగా ఆమోదిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ కి, రాష్ట్ర మంత్రులకు, రాష్ట్ర శాసనసభ్యులకు, అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ ఛైర్మన్. భూపతిరాజు రవీంద్ర రాజు శాశ్వత రాజధానిగా అమరావతి గా అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు, తెలియజేయడం జరిగింది. ప్రజా రాజధాని అమరావతి బిల్లును వెంటనే పార్లమెంట్ కి పంపించడం పార్లమెంటులో అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పిస్తూ ఆమోదించడం వెంటనే రాజ్యసభలో కూడా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసినందుకు కృషిచేసిన దేశ ప్రధాని నరేంద్ర మోడీ కి, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకి, కేంద్ర మంత్రులకు, పార్లమెంట్ సభ్యులకు, రాజ్యసభ సభ్యులకు, ప్రత్యేక ధన్యవాదాలు, తెలిపారు.**



## అగ్ని ప్రమాదబాధితులకు గ్లోబల్ అలుమ్ని వెల్ఫేర్ ట్రస్టు స్కూల్ మెట్ ట్రస్ట్ యువత చేయుత

**గోకవరం, వజ్రభారతి ఏప్రియల్ 02 :(చిక్కిరెడ్డి వీరబాబు ):** ఇటీవల గోకవరం మండలం రంపఎర్రంపాలెం గ్రామంలోని గంగా భవాని నగర్ శివారులో కుంజాల రఘుపతి,కుటేటి దుర్గాలకు చెందిన రెండు తాటకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కు గురై కాలిపోయాయి విషయం తెలిసిన స్కూలు మెట్ ట్రస్టు గ్రూప్ లో మెసేజ్ చేసిన స్పందించిన యువత 19,500/- విలువ గల వంట సామాన్లు, బట్టలు, మాత్రమే కాకుండా కొంత డబ్బులు బాధితుల వద్దకు వెళ్లి అందజేసి పరామర్శించి,ధైర్యం చెప్పారు. ట్రస్ట్ నుంచి మెసేజ్ పెట్టిన వెంటనే రెస్పాన్స్ అయిన యువత గ్రామంలో ఇలాంటి సంఘటనలు జరిగిన వెంటనే ఎక్కడ ఉన్నా వెంటనే స్పందిస్తారు వారు ఆర్థిక సహాయం చేస్తారు ఈ కార్యక్రమంలో , ట్రస్టు ప్రెసిడెంట్ కాకర విష్ణు,ట్రస్టు గౌరవ సభ్యులు సత్యం పెద్దబ్బులు, పాటి అప్పలరాజు తాతీలు,నారా ప్రసాద్, పప్పు రాఘవులు,పెదిరెడ్ల రాజు మాస్టర్,డాక్టర్ గుల్లిశీకల నాని,సురపరెడ్డి రామక్రిష్ణ, తిరుపతి బాబి, దర్శిపూడి వెంకన్న,కాళ్ళ దుర్గా ప్రసాద్,పంతం వీరబాబు, చెక్క గణేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ పాలకవర్గానికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు పౌర సన్మానం.



**గోకవరం, వజ్రభారతి ఏప్రియల్ 02:-(చిక్కిరెడ్డి వీరబాబు ):** ఏప్రిల్ రెండో తేదీ నుంచి సర్పంచ్ ల పదవీకాలం ముగియడంతో స్థానిక పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యులను రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు గురువారం గోకవరం పంచాయతీ కార్యాలయం వద్ద వారిని ఘనంగా సత్కరించారు.శాలువాలు కప్పి,పూలమాలతో ఘనం గా సత్కరించి, మహిళలకు పట్టుచీరలు, పురుషులకు బట్టలు అందించి, వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో బత్తుల నానాజీ, కంబాల యువసేన అధ్యక్షులు ఉంగరాలు మణిరత్నం,పెద్దాడ వెంకన్న దొర, తాటికొండ సురేష్,తుమ్మల బుజ్జి,పదిలం చక్రారావు,మండే గౌతమ్, కాకర దుర్గారావు, నందూరి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## మార్టేరు గ్రామ సర్పంచ్ మట్టా కుమారి రాము పదవి విరమణ సత్కారం.



**పెనుమంట్ర, వజ్రభారతి, ఏప్రిల్ 2:** ఈ కార్యక్రమం లో జడ్పిటిసి సభ్యురాలు కర్రీ గౌరీ సుభాషిణి,ఉపసర్పంచ్ కర్రీ వేణుబాబు,సచివాలయం 1 మరియు 2 కార్యదర్శులు ,సచివాలయం సిబ్బంది , పంచాయతీ సిబ్బంది,పారిశుధ్య కార్మికులు సర్పంచ్ మట్టా కుమారి రాము లను ఘనం గా సత్కరించారు. ఈ సందర్భంగా జడ్పిటిసి సభ్యురాలు గౌరీ సుభాషిని మాట్లాడుతూ మార్టేరు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం ఎంతో అభినందనీయమన్నారు డ్రైనేజీ వ్యవస్థ అర్హులైన వారికి పెన్షన్లు కుల మత రాజకీయాలకతీతంగా అందరి మన్ననలు పొందుతూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారని ఆమె అన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మట్ట కుమారి రాము మాట్లాడుతూ మార్టేరు గ్రామ ప్రజలు గత ఐదు సంవత్సరాలుగా తమ వెన్నంటి ఉంటూ గ్రామ ప్రజలు అందించిన సహాయ సహకారాలు తో పాటు వెన్నుదన్నుగా ఉన్న వార్డు సభ్యులు కి కృతజ్ఞతలు తెలిపారు. పెనుమంట్ర మండలం జడ్పిటిసిసభ్యురాలు కర్రీ గౌరీ సుభాషిణి ఉపసర్పంచ్ కర్రీ వేణుబాబు మరియు సర్పంచ్ మట్టా కుమారిరాము కలసివార్డ్ సభ్యులను ఘనం గా సత్కరించారు.




# నిరుపేదలకు వరం... ప్రజాపాలన ప్రగతికి మార్గం

### ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్

### సత్తుపల్లిలో వార్డు సభలు ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి

### "ప్రజా పాలన -- ప్రగతి పాలన"లో భాగంగా సత్తుపల్లిలో వార్డు సమావేశాలు

**సత్తుపల్లి, ఏప్రిల్ 2 (వజ్రభారతి తెలుగు దినపత్రిక:** ఇండిపెండెంట్ జర్నలిస్ట్ శ్రీనివాస్ బత్రా) తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వేగవంతమైన అభివృద్ధికి దిశానిర్దేశం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన -- ప్రగతి పాలన" 99 రోజుల ప్రణాళిక క్రమంలో సత్తుపల్లి పట్టణంలో కీలక కార్యక్రమం జరిగింది. సత్తుపల్లి మున్సిపాలిటీలోని 10, 11 వార్డుల్లో నిర్వహించిన "వార్డు సభ" కార్యక్రమంలో ప్రజలతో నేరుగా మమేకమవుతూ సమస్యలను తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ప్రధానంగా పాల్గొన్నారు. ఆమెతో పాటు ప్రభుత్వ అధికారులతో కలిసి వార్డుల్లో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించి, ప్రగతిని పరిశీలించారు.వార్డు సభలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి దయానంద్ మాట్లాడుతూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చేరేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా విని, సంబంధిత అధికారులకు వెంటనే పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్



రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, ఇతర ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు. అలాగే సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదే చెన్నారావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు హాజరయ్యారు.ప్రజలు ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారుల మరమ్మతులు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలను ప్రస్తావించారు. వాటిపై స్పందించిన ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు."ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకోవడం ద్వారా పాలనను మరింత పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చడమే ఈ కార్యక్రమం లక్ష్యం" అని అధికారులు తెలిపారు. 99 రోజుల ప్రణాళికలో భాగంగా ప్రతి వార్డులో ఇలాంటి సభలు నిర్వహించి, అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు.సత్తుపల్లి పట్టణంలో ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం పెరిగిందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ కార్యక్రమం దానికి నిదర్శనమని పలువురు పేర్కొన్నారు.

## అమరావతి శాశ్వత రాజధాని జీలుగుమిల్లిలో పండుగ వాతావరణం

### తహసిల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో సంబరాలు



**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్-02:** జీలుగుమిల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో అమరావతి శాశ్వత రాజధానిగా అమలు కావడంతో పండుగ వాతావరణం నెలకొంది. మండల పరిషత్ కార్యాలయం లో కూడా అధికారులు, సిబ్బంది సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కార్యాలయ ప్రాంగణంలో ఆనందోత్సాహాలు వ్యక్తమయ్యాయి. తహసిల్దార్ వెంకటేశ్వర మాట్లాడుతూ, అమరావతి రాజధాని నిర్ణయం ప్రజల ఆకాంక్షలకు న్యాయం చేసిందన్నారు.రాష్ట్ర అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.ఈ నిర్ణయం వల్ల ప్రాంతీయ అభివృద్ధి వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యాలయ సిబ్బంది పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.స్వీట్లు పంచుకుని ఆనందాన్ని పంచుకున్నారు.ప్రజలు కూడా ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సంతోషం వ్యక్తం చేశారు.మండల కేంద్రంలో మొత్తం ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## వెలమకొత్తూరు హైస్కూల్ లో మధ్యాహ్నం భోజనం వడ్డించిన ఎమ్మెల్యే దివ్య





**కోటనందూరు, ఏప్రియల్ 02, వజ్రభారతి (అల్లు అప్పలకొండ):** అభివృద్ధి సంక్షేమ పథకాల సాధనకే పరిమితం కాకుండా ప్రభుత్వ విఫ్ యనమల దివ్య పథకాల అమలు తీరుపై క్షేత్ర పరిశీలన ప్రశంసలు కుంటున్నాయి.ఈనేపథ్యంలో ఇవాళ కాకినాడ జిల్లా, తుని మండలం, వెలమ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను సందర్శించిన ఎమ్మెల్యే యనమల దివ్య విద్యార్థులకు అమలు జరుగుతున్న మధ్యాహ్న భోజనం పథకంపై సమీక్షించారు.మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు తో కలిసి పిల్లలకు స్వయంగా భోజనాలు వడ్డించిన ఆమె అనంతరం అంగన్వాడీ కార్యకర్తలతో ముచ్చటించారు. పాఠశాల మౌలిక సమస్యలపై టీచర్లను అడిగి తెలుసుకున్నారు . అనంతరం అమ్మవారి ఆలయానికి చేరుకుని దైవదర్శనం చేసుకున్నారు.ఈకార్యక్రమంలో కూటమి నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి,సుర్ల లోవరాజు, బొప్పన రాము,వెలుగుల గోపాలకృష్ణ, రామకృష్ణ,తమరాన సత్యనారా యణ,తమరాన రామకృష్ణ వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



## భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకుని యమ్ మల్లవరంలో క్రికెట్ టోర్నమెంట్



**గోకవరం, వజ్రభారతి ఏప్రిల్ 02:(చిక్కిరెడ్డి వీరబాబు ):** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం మల్లవరం గ్రామంలో భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా క్రికెట్ టోర్నమెంట్ పెట్టడం జరిగింది ఇందులో భాగంగా ఈరోజు అనగా 02/04/2026 గ్రామ సర్పంచ్ విడుదల అర్జున్ రావు ఎంపీటీసీ మరిచే అప్పారావు వైస్ ప్రెసిడెంట్ గొర్రెపల్లి శ్రీను ఫిషర్ మాన్ సొసైటీ ప్రెసిడెంట్ పేకల రవి మరియు వైఎస్ఆర్సిపి నాయకులు పైల కళ్యాణ గోరుముచ్చి చిట్టిబాబు మరియు డి పి ఆర్ స్కూల్ హెచ్ఎం యాళ్ల అబ్రహం పాల్ పాల్గొనడం జరిగింది ఇందులో భాగంగా మల్లవరం మేనేజ్మెంట్ టీం యూత్ తదితరులు అనేకమంది ఈ యొక్క టోర్నమెంట్లో పాల్గొనడం జరిగింది

## జగ్జీవన్ రామ్ జయంతిని శాంతియుతంగా జరుపు కోవాలి - ఎస్ ఐ రామకృష్ణ

**తాళ్లపూడి, వజ్ర భారతి ఏప్రిల్ 2:** ఈ నెల 5వ తేదీన జరిపే డా. బాబు జగ్జీవన్ రామ్ జయంతిని తాళ్లపూడి మండలం లో శాంతియుతంగా, ఎటువంటి విద్వేషాలు జరుపకుండా, డిజేలు,తీన్మార్ లు పెట్టి ఎవ్వరికి సౌండ్ పొల్యూషన్ ఇబ్బందులు ఎదురవ్వకుండా చూడాలని పోలీసు హెచ్చరికలు జారిచేసారు. దీనిలో భాగంగా కొవ్వూరు రూరల్ సి.ఐ విజయబాబు, ఎస్సై టి. రామకృష్ణ తన సిబ్బందితో కలిసి మండలం లో పర్యటించారు. ప్రతి గ్రామమం లోను జగ్జీవన్ రామ్ విగ్రహాలను సందర్శించి, అక్కడున్న కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటన లు జరుగ కూడదని కోరారు. కొంతమంది ఆక్టివ్ మెంబెర్స్ ను ఎంపిక చేసి పీస్ కమిటీ గా గుర్తించినట్లు తెలిపారు. మండలం అంతా పోలీస్ నిఘా ఉందని తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ తెలిపారు.



# జై హనుమాన్ నినాదాలతో మార్మోగిన ఖమ్మం

## హనుమాన్ మహిమను వివరించిన డాక్టర్ జెట్టి తులసీదాస్

## రథోత్సవంలో పాల్గొన్న తులసీదాస్ -- భక్తుల్లో ఉత్సాహం

**ఖమ్మం, ఏప్రిల్ 2: (బెస్ట్ న్యూస్ తెలుగు దినపత్రిక):** ఖమ్మం పట్టణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, భజనలు, హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించగా, ప్రధాన ఆకర్షణగా హనుమాన్ రథోత్సవం భక్తులను ఆకట్టుకుంది. వేలాది మంది భక్తులు పాల్గొని భక్తి పరవశంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమానికి కీర్తి చక్ర అవార్డు గ్రహీత, నిర్మల నిస్వార్థ వాగ్వినయ భూషిత రత్న, బాలబంధు అవార్డు గ్రహీత, మానవ మార్గదర్శి, టీటీడీ ధర్మచార్యగా గుర్తింపు పొందిన డాక్టర్ జెట్టి తులసీదాసు ముఖ్య అతిథిగా హాజరై హనుమాన్ రథోత్సవంలో పాల్గొన్నారు. ఆయన రథాన్ని పూజించి, భక్తులతో కలిసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జెట్టి తులసీదాసు మాట్లాడుతూ, హనుమాన్ జయంతి ప్రాముఖ్యతను విశదీకరించారు. హనుమాన్ జయంతి అనేది ఆంజనేయ స్వామి జన్మదినంగా జరుపుకునే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. శివుని అంశతో అంజనాదేవి, కేసరి దంపతులకు జన్మించిన హనుమంతుడు భక్తి, బలం, బుద్ధి, నిస్వార్థ సేవలకు ప్రతీకగా నిలిచాడని తెలిపారు.

**భక్తి, సేవకు ప్రతీక హనుమంతుడు:** శ్రీరాముడిపై అపారమైన భక్తితో జీవించిన హనుమంతుడు, తన జీవితాన్ని పూర్తిగా రామసేవకే అంకితం చేశాడని తెలిపారు. నిస్వార్థ భక్తి ఎలా ఉండాలో హనుమంతుడి జీవితమే ఉత్తమ ఉదాహరణ అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆయన ఆదర్శాలను




అనుసరించాలని సూచించారు.

**సంకటమోచనుడిగా ఆరాధన:** హనుమంతుడు సంకటాలను తొలగించే దేవుడిగా ప్రసిద్ధి చెందాడని, హనుమాన్ జయంతి రోజున ఆయనను భక్తితో పూజిస్తే శని దోషాలు, భయాలు, ప్రతికూల శక్తులు తొలగిపోతాయని భక్తుల విశ్వాసమని వివరించారు. జీవితంలో ఎదురయ్యే కష్టాలను అధిగమించేందుకు హనుమంతుని ఆశీర్వాదం ఎంతో కీలకమని అన్నారు.

**శక్తి, ధైర్యానికి మూలం:** హనుమంతుడు అపారమైన బలం, ధైర్యం, జ్ఞానానికి ప్రతీక అని పేర్కొంటూ, ఆయనను ఆరాధించడం ద్వారా భక్తులకు మానసిక స్థైర్యం, ధైర్యం పెరుగుతాయని తెలిపారు. యువత హనుమంతుడి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ముందుకు సాగాలని సూచించారు. పూజింపబడుతున్న దేవుడు అని, ఆయనను స్మరించుకోవడం ద్వారా ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయని భక్తులు నమ్ముతారని చెప్పారు. హనుమాన్ జయంతి రోజున చేసే పూజలు విశేష ఫలితాలను ఇస్తాయని పేర్కొన్నారు. ఇక ఖమ్మం పట్టణంలో జరిగిన రథోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఊరేగింపులో పాల్గొని ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. పలు ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రధాన దేవాలయాలను అలంకరించి, ప్రత్యేక దీపాలంకరణలు ఏర్పాటు చేశారు. యువత, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు. పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేసి, ట్రాఫిక్‌ను నియంత్రించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ, హనుమాన్ జయంతి ఉత్సవాలు ప్రతి ఏడాది ఇలాగే ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. సమాజంలో ఐక్యత, భక్తి భావాన్ని పెంపొందించడంలో ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. మొత్తం మీద ఖమ్మం పట్టణంలో జరిగిన హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తి, శ్రద్ధ, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా నిలిచి అందరినీ ఆకట్టుకున్నాయి.




## గండేపల్లిలో సామాజిక పెన్షన్ల పంపిణీ

### గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ చేతుల మీదుగా

పంపిణీ**గండేపల్లి,వజ్రభారతి,ప్రతినిధి, జగ్గంపేట నియోజకవర్గ ఇంచార్జ్, ఏప్రిల్, 02:-** మండల కేంద్రం గండేపల్లి గ్రామంలో సామాజిక పెన్షన్లను గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొల్లంరెడ్డి రామకృష్ణ పంపిణీ చేశారు. గ్రామంలో ఇటీవల మరణించిన రెడ్డి మహేష్‌కు సంబంధించిన పెన్షన్‌ను ఆయన భార్య మంగకు, పాలిశెట్టి అప్పారావుకు సంబంధించిన పెన్షన్‌ను ఆయన భార్య సరస్వతికి, అలాగే కండెల్లి నాగేశ్వరావు (రాజు)కు సంబంధించిన పెన్షన్‌ను ఆయన భార్య పాపకు అందజేశారు. ఈ సందర్భంగా బొల్లంరెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందనే దానికి సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమమే నిదర్శనమని తెలిపారు. భర్త మరణించిన తరువాత వచ్చే నెల నుంచే భార్యకు పెన్షన్ అందించడం ద్వారా ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటోందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆదరణ కూటమి ప్రభుత్వానికి లభిస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల సత్తిబాబు, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, పెనుగాడి నాగరాజు, సనుమూరి అప్పారావు, సచివాలయ సిబ్బంది రాజీ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

## జీలుగుమిల్లి ఆశ్రమ బాలికల వసతి గృహంపై ఎమ్మెల్యే చిర్రి ఆకస్మిక తనిఖీ

### ఆహార నాణ్యత, విద్యార్థుల ఆరోగ్యంపై కఠిన ఆదేశాలు



**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్ 02 :** పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జీలుగుమిల్లి ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల వసతి గృహాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై సమగ్రంగా పరిశీలన జరిపారు. ప్రత్యేకంగా భోజన వ్యవస్థపై దృష్టి సారించి, వంటశాలను స్వయంగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదా అనే విషయాన్ని నిశితంగా పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానంపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మెనూ అమలు చేయాలని వార్డెన్లకు ఆదేశించారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని తక్షణ పరిష్కారానికి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అనంత జిల్లా జాయింట్ కలెక్టర్ గా ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు

### కర్నూల్ కలెక్టర్ గా అదే స్ఫూర్తితో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించండి

### కర్నూల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి



**పుట్టపర్తి,వజ్ర భారతి (సత్యసాయి జిల్లా ప్రతినిధి)ఏప్రిల్ 02:-** కర్నూల్ లో ఓ వివాహానికి హాజరై అక్కడే సమీపంలో ఉన్న కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి,కలెక్టర్ ఏ.సిరి ని పుట్టపర్తి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలసి, పుష్పగుచ్చం అందించి అభినందనలు తెలియజేశారు. గతంలో డాక్టర్ సిరి అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్ గా పనిచేస్తూ...అందరితో కలిసిపోయి ప్రజల్లో ఎంతో మంచి పేరు సంపాదించుకున్నారు. అదే స్ఫూర్తితో ప్రస్తుతం కర్నూలు కలెక్టర్ గా పనిచేస్తుండడంతో, ఆమెను మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.




## జీలుగుమిల్లి పంచాయతీ పదవీకాలం విజయవంతం

### సర్పంచ్ చిర్రి జగదాంబ సంతృప్తి వ్యక్తం

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్-02:** జీలుగుమిల్లి పంచాయతీ పదవీకాలం విజయవంతంగా పూర్తయిందని సర్పంచ్ చిర్రి జగదాంబ తెలిపారు. పదవీకాలం చివరి రోజు సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో కార్యవర్గ సిబ్బందిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పదవీ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రతి వీధిలో వీధిలైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, నూతన డ్రైనేజీ వ్యవస్థలు నిర్మించామని తెలిపారు. అలాగే గ్రామంలోని పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేసి, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచామని చెప్పారు. కొత్తగా వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరించామని వెల్లడించారు. పంచాయతీ అభివృద్ధిలో కార్యవర్గ సభ్యులు, సిబ్బంది మరియు గ్రామ ప్రజల సహకారం కీలకమని ఆమె అన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాలడుగుల అశోక్, ఉప సర్పంచ్ బొంతు రవితేజ, సభ్యులు కొప్పుల సత్యనారాయణతో,నేలటూరి మోహన్, సిబ్బంది గ్రామస్థులు పాల్గొన్నారు.

## పంచాయతీ పాలక మండలి సభ్యులకు వీడ్కోలు

**తాళ్లపూడి, వజ్ర భారతి ఏప్రిల్ 2:** తాళ్లపూడి మండలం పెద్దేవం పంచాయతీ ఎస్సి రిజర్వుడు పంచాయతీ, సర్పంచ్ గా గెలు పొందిన తిగిరిపల్లి వెంకట్రావు కంటే జనరల్ పంచాయతీలా ఉప సర్పంచ్ గా చేసిన తోట రామ కృష్ణ అన్నీ తానే అనే విధంగా పరిపాలన సాగించటం పట్ల తోటను పలువురు అభినందించారు. పంచాయతి పరిపాలన ముగింపు సందర్భంగా జరిగిన సమావేశం లో మాజీ ఎంపీ భరత్, రాజమండ్రి పార్లమెంట్ వైస్సార్సీపీ సమన్వయ కర్త గూడూరి శ్రీనివాస్, కొవ్వూరు నియోజకవర్గ వైకాపా సమన్వయ కర్త తలారి వెంకట్రావు వంటి ప్రముఖులు హాజరయ్యారు. తోట ఆహ్వానం మేరకు పంచాయతీ ఎన్నికల్లో తోట రామకృష్ణ వర్గం కోసం ప్రచారం చేసానని, గెలుపొందిన పాలక వర్గం వెంట తోట గ్రామానికి చేసిన సేవలు, అభివృద్ధి అమోఘం అని భరత్ పేర్కొన్నారు. ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, గ్రామ సర్పంచ్ మరియు వార్డు సభ్యులను అభినందిస్తూ సత్కరించారు.




## అన్ని పాఠశాలల్లో అంబేద్కర్, జగ్జీవన్ రామ్ ల చిత్రపటాలను ఏర్పాటు చేయాలి -- ఎం ఆర్ పి ఎస్ డిమాండ్



**తాళ్లపూడి, వజ్ర భారతి ఏప్రిల్ 2:** భారతరత్న డా బి ఆర్ అంబేద్కర్, భారత మొదటి ఉప ప్రధానమంత్రి డా బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసే విధానంగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి వారికి, జిల్లా ఎం ఆర్ పి ఎస్ కమిటీ ఒక వినతి పత్రాన్ని అందచేశారు. ఆయా జాతీయ నాయకుల జయంతి సందర్భంగా ప్రభుత్వం సెలవు దినములుగా ప్రకటించిన దృష్ట్యా వారి జయంతి వేడుకలను ఒక రోజు ముందు గా ప్రభుత్వపాఠశాలల్లో జరుపుతూ, పాఠశాల విద్యార్థులకు వారి దేశ సేవల గురించి అవగాహన కల్పించాలని, అనన్యమైన సేవలు దేశానికి అందించిన వీరి చిత్ర పటాలను పాఠశాలల్లో ప్రదర్శించడం మరియు వారి జయంతులను జరుపుకోవడం ద్వారా విద్యార్థుల్లో దేశభక్తిని, గౌరవాన్ని పెంపొందించవచ్చు వారు విన్నవించారు. డి ఈ ఓ ను కలిసిన వారిలో తూర్పుగోదావరి జిల్లా ఎం ఆర్ పి ఎస్ కమిటీ గెడ్డం వినోద్ మాదిగ, గాలింకి రాము మాదిగ, ముప్పిడి డేనియేలు మాదిగ, వైరాల రమేష్ మాదిగ,పెదపూడి. ఎల్లారావు,రాచర్ల. సుధాకర్ మాదిగ, యార్లగడ్డ సతీష్ మాదిగ ఉన్నారు.

## స్నేహానికి గుర్తుగా గంగిరెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్

ఓడి చెరువు,వజ్ర భారతి ఏప్రిల్ 02:- స్నేహితులందరూ కలిసి మెలిసి ఎన్నో ఎన్నెన్నో మధురాతి మధుర తీపి జ్ఞాపకాలు చిరస్థాయిగా మిగిలిపోయే విధంగా గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండేవారు. అనుకోని సంఘటన ఒక స్నేహితుని (గంగిరెడ్డి) అనారోగ్యంతో అకాల మరణం చెందడంతో,తోటి స్నేహితులందరూ నిర్ఘాంత పోయారు.. నిన్న మొన్నటి వరకు మా మధ్య ఉన్న మా స్నేహితుడు మమ్మల్ని వదిలి వెళ్లడం మమ్మల్ని ఎంతో కలిసి వేసిందని,అలాంటి స్నేహితుని జ్ఞాపకార్థంగా మండల పరిధిలోని ఇనగలూరు యూత్ ఆధ్వర్యంలో,గంగిరెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతోంది. మండలంలోని ఆసక్తి గల యువత ఈనెల 10 వ తేదీ లోపు రూ,1000 ఎంట్రీ ఫీజు కట్టి టీంలు నమోదు చేసుకోవాలని,11వ తేదీ నుండి మ్యాచ్ లు ప్రారంభం అవుతాయని,గెలుపొందిన జట్టుకు రూ,40116.రన్నర్ జట్టుకు రూ,20116 బహుమతులు ప్రధానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సమాచారం కోసం 8688177269.. 9959549676 నంబర్లను సంప్రదించాలని వారు తెలిపారు.



## జీలుగుమిల్లి లో పది పరీక్షలు ప్రశాంతం

**ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్షలు ముగింపు**

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్-02:** జీలుగుమిల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పదో తరగతి (పది) పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా సజావుగా నిర్వహించబడ్డాయి.విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకుని పరీక్షలు రాశారు.పరీక్షా కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారులు పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.పరీక్షా హాళ్లలో కఠిన నియమాలు అమలు చేశారు.విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు రాశారు.తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల బయట వేచి ఉన్నారు.మొత్తంగా పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యాయి.

## పోలవరంలో అమరావతి సంబరాలు -- హోరెత్తిన బైక్ ర్యాలీ

**ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు**



**పోలవరం (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్02:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా అమరావతిని ఖరారు చేస్తూ అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా పోలవరం మండలంలో పండుగ వాతావరణం నెలకొంది. సందర్భంగా తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో భారీ సంబరాలు నిర్వహించారు.సామాన్య ప్రజలు, కార్యకర్తలతో కలిసి శ్రీనివాసులు ఉత్సవాల్లో పాల్గొని ఆనందాన్ని పంచుకున్నారు.పోలవరం మండల కేంద్రంలో సుమారు 2 కిలోమీటర్ల మేర భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.నినాదాలతో వీధులు మార్మోగగా, టపాసులు కాలుస్తూ, మిఠాయిలు పంచుతూ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.ర్యాలీ అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, అమరావతి మన అందరి రాజధాని. ఇది నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టికి దక్కిన విజయమని పేర్కొన్నారు.పోలవరం నియోజకవర్గ ప్రజల తరపున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంగిన వెంకటరమణతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## టీడీ జనార్ధన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ విజయ నాయక్



**ఏలూరు (వజ్ర భారతి) ఏప్రిల్02:** విజయవాడలోని కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీ జనార్ధన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.

ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ విజయ నాయక్ ప్రత్యేకంగా హాజరై జనార్ధన్‌ను కలిశారు.పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా తెలుగు యువత నాయకుడు కిరణ్, దంతోజు రాజేష్ పాల్గొన్నారు.పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలకు ఉత్సాహాన్ని నింపారు.జనార్ధన్ సేవలను కొనియాడుతూ నాయకులు అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలు స్నేహపూర్వక వాతావరణంలో ఆనందంగా జరిగాయి.పార్టీ కార్యాలయం మొత్తం శుభాకాంక్షల సందడితో కళకళలాడింది.


## జ్యోతులు పల్లకీ ఊరేగింపుతో వైభవంగా అమ్మవారికి ఉయ్యాల సేవ

అమడగూరు,వజ్రభారతి ఏప్రిల్02:-శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శీతిరెడ్డిపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో,ఉయ్యాల సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ప్రతిష్ఠించి ఉయ్యాల సేవ చేశారు. అమ్మవారికి ఎంతో ప్రీతిదాయకమైన జ్యోతులు మోసిన మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో ఊరేగింపుగా గ్రామంలోని ఇంటింటికీ తీసుకువెళ్లగా,భక్తులు హారతులు పట్టి మొక్కులు చెల్లించుకున్నారు.గ్రామ వీధులన్నీ భక్తుల జయజయధ్వానాలతో మార్మోగాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తం రెడ్డి,ఆలయ కమిటీ సభ్యులు,శీతిరెడ్డిపల్లి గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు అభ్యున్నతి కోసమే రాజ్యముద్రతో కూడిన పాస్ పుస్తకాలు





**కోటనందూరు, ఏప్రియల్ 02, వజ్రభారతి(అల్లు అప్పలకొండ):** రైతు అభ్యున్నతితో పాటు వారి భూములకు పూర్తి రక్షణ కల్పన కోసమే రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలు రూపొందించడం జరిగిందని ప్రభుత్వ విఫ్ యనమల దివ్య అన్నారు. కాకినాడ జిల్లా,తుని మండల టీడీపీ అధ్యక్షుడు చింతంనీడి అబ్బాయి అధ్యక్షతన నందివంపు గ్రామంలో తాహాశీల్దార్ గిడుతూరి ప్రసాదరావు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీనియర్ నేత యనమల రాజేష్ తో కలిసి ముఖ్య అతిథిగా ప్రభుత్వవిఫ్ యనమల దివ్య హాజరయ్యారు. ఇక్కడ 185 మంది రైతులకు సర్వహక్కులు కల్పిస్తూ రెవిన్యూ యంత్రాంగం రూపొందించిన డిజిటల్ పాసు పుస్తకా లను అందజేసారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే యనమల దివ్య కొత్త పాసుపుస్తకాల్లో భూమి రక్షణకు సంబంధించి పొందిపరిచిన వివరాలను తెలియపరి చారు.అలాగే కేవీఎన్ ఆధ్వర్యంలో టీఎన్ యూఎస్ క్యాలెండర్ డైరీని ఎమ్మెల్యే యనమల దివ్య ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బొప్పన రాము, చిటికెల శ్రీనివాసరావు, అరిగెల నర్సింహమూర్తి,జక్కాన రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు. తేటగుంట క్యాంప్ కార్యాలయంలో కోటనందూరు మండల తాహాశీల్దార్ పివివి సత్యనారాయణ ఆధ్వర్యంలో కూడ పాసుపుస్తకాల పంపిణీ జరిగింది .(టీజేనగరం) తాటిపాక గ్రామానికి చెందిన 135 మందికి ఎమ్మెల్యే యనమల దివ్య కొత్తపాసుపుస్తకాలు పంపిణీ చేశారు.ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పోతల సూరిబాబు,తాటిపాక గ్రామ నాయకులు సుర్ల అప్పలనాయుడు,సుర్ల రాంబాబు,సుర్ల నాని,సుర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్ట్ ఆంధ్రప్రదేశ్‌కు వరం గవర్నర్ అబ్దుల్ నజీర్

**ప్రాజెక్ట్ పనుల పురోగతిపై ఉన్నత స్థాయి సమీక్ష**



**పోలవరం (వజ్ర భారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ ఏప్రిల్ 02 :** పోలవరం ప్రాజెక్ట్‌ను పరిశీలించడం తన అదృష్టంగా భావిస్తున్నానని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ తెలిపారు. ప్రాజెక్ట్ మీటింగ్ హాలులో జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, అధికారులు, ఇంజనీర్లతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, బహుళార్థసాధకమైన పోలవరం ప్రాజెక్ట్ రాష్ట్ర ప్రజలకు వరప్రదాయినిగా నిలుస్తుందన్నారు. ప్రాజెక్ట్ పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు.జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ, ప్రాజెక్ట్‌లో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తయిందని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాలకు ముందే ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి జాతికి అంకితం చేయడమే లక్ష్యమన్నారు. ప్రాజెక్ట్ ద్వారా 322.73 టీఎంసీల నీటి వినియోగం, 194.6 టీఎంసీల నిల్వ సామర్థ్యం కల్పించబడుతుందని తెలిపారు. లక్షలాది ఎకరాలకు సాగునీరు, 28.5 లక్షల మందికి త్రాగునీరు, 940 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని వివరించారు. భూసేకరణలో భాగంగా 1 లక్ష ఎకరాలకు పైగా అవసరం ఉండగా, ఇప్పటివరకు 91,949 ఎకరాలు సేకరించామని తెలిపారు. నిర్వాసితుల పునరావాసం కూడా దశలవారీగా కొనసాగుతోందన్నారు.జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్ట్ తెలుగు ప్రజల జీవనాడిగా నిలుస్తుందని, నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.ఇంజినీరింగ్ అధికారులు ప్రాజెక్ట్ పురోగతిని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.



## అమరావతి రాజధాని బిల్లు ఆమోదం -- పోలవరం లో ఘన సంబరాలు

**ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయంలో ఆనందోత్సాహాలు**

**జీలుగుమిల్లి (వజ్రభారతి) ఏలూరు జిల్లా ఇంచార్జ్ 02:** అమరావతి రాజధాని బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు క్యాంపు కార్యాలయంలో ఘనంగా సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు దీపాలు వెలిగించి హర్షం వ్యక్తం చేశారు.ఈ చారిత్రాత్మక విజయాన్ని స్వాగతిస్తూ ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు.ఈ బిల్లుకు మద్దతు ఇచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ నిర్ణయం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.రాష్ట్రానికి స్థిరమైన పరిపాలనకు ఇది బలమైన పునాది అవుతుందని అన్నారు.పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు.ప్రజల దీర్ఘకాల ఆశలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి రాము, ఉపాధ్యక్షుడు కొప్పుల శ్రీకాంత్, కూటమి నాయకులు తమ్మన సాంబశివరావు, సరియం రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి ఉత్సవాలకు అంకురార్పణ





### ఘనంగా కుంభకూడు కార్యక్రమం.

### భక్తులతో కిటకిటలాడిన అమడగూరు

అమడగూరు,వజ్రభారతి ఏప్రిల్ 02:- అమడగూరు మండల కేంద్రంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరి దేవి జ్యోతి బ్రహ్మోత్సవాలకు బుధవారం రాత్రి ఘనంగా అంకురార్పణ జరిగింది.ఉత్సవాల్లో భాగంగా రాత్రి 11 గంటల నుంచి కుంభకూడు కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.అమ్మవారి ఉత్సవాలలో భాగంగా మొదటిరోజు అర్ధరాత్రి ఆలయ ధర్మకర్త పొట్ట పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో కుంభకూడు కార్యక్రమం ప్రారంభమైంది.ఈ సందర్భంగా చీకిరేవులపల్లికి చెందిన తొగటవీర సంఘం,పళ్లెం చంద్రకళ,నరసింహప్ప కుటుంబ సభ్యులు కలిసి కొర్రల బియ్యం,ఇతర చిరుధాన్యాలతో వండిన కుంభాన్ని ఒక పెద్ద రాశిగా పోసి,పసుపు,కుంకుమలు,పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు,హారతులు సమర్పించారు.ఈ విశిష్ట కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి చిన్నా,పెద్దా తేడా లేకుండా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.అనంతరం జంతు బలిదానం చేసిన కుంభాన్ని తమ గ్రామాలకు,ఇళ్లకు,పంట పొలాలకు తీసుకెళ్లి చల్లుకుంటే శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.దీంతో భక్తులు పోటీపడి కుంభాన్ని తీసుకెళ్లారు.కుంభకూడు కార్యక్రమం మంగళ వాయిద్యాల నడుమ కోలాహలంగా సాగింది.ఆలయం ఎదుట యువకులు,మహిళలు,చిన్నారులు భజనలు,కోలాటం,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులను ఆకట్టుకున్నారు.భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఆలయ ధర్మకర్త,కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,పోలీసులు తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లా స్థాయి శాప్ లీగ్--2026 ఘన ప్రారంభం

**నీటి క్రీడల పోటీలు ప్రారంభించిన డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి**



**ఏలూరు (వజ్ర భారతి) ఏప్రిల్02:** ఏలూరు జిల్లా స్థాయి శాప్ లీగ్--2026లో భాగంగా కయాకింగ్, కానోయింగ్, రోయింగ్, డ్రాగన్ బోట్ వంటి నీటి క్రీడల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్ కొవ్వాసు జగదీశ్వరి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని క్రీడా ఆంధ్రప్రదేశ్‌గా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.ప్రతి నెల శాప్ క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.ఇటీవల నిర్వహించిన ట్రైబల్ హంట్ క్రీడలు విజయవంతమయ్యాయని గుర్తుచేశారు.జంగారెడ్డిగూడెంలో జరగనున్న నీటి క్రీడల మహోత్సవానికి ముందస్తుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.మే 1 నుంచి 30 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఆసక్తి గల క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను మెరుగుపరుచుకోవాలని సూచించారు.ప్రతి క్రీడలో రాణించే వారికి ప్రభుత్వం అన్ని విధాల సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.అనంతరం జెండా ఊపి పోటీలను ప్రారంభించారు.



## సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకెళ్లాలి: జిల్లా కలెక్టర్ ప్రావిణ్య

### బీ.సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలు



**సంగారెడ్డి జిల్లా వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 02 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు.సర్వాయి పాపన్న గౌడ్ 316 వ వర్ధంతి సందర్భంగా గురువారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదురుగా గల సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి కలెక్టర్, బిసి కుల సంఘాల ప్రతినిధులు, అధికారులు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రవీణ్య మాట్లాడుతూ, పోరాట యోధుడు పాపన్నగౌడ్ వర్ధంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తోందని గుర్తు చేశారు. అన్యాయాన్ని ఎదురించేందుకు సర్వాయి పాపన్న గౌడ్ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆ మహనీయుని ఆశయాలకు అనుగుణంగా సామాన్యులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్, కల్లుగీత కార్మికుల అధ్యక్షులు రమేష్, వీరేశం,ఆశన్న, వినయ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలకు జిల్లా ఎస్పీని ఆహ్వానించిన... బాదం ప్రవీణ్



**ములుగు జిల్లా వజ్ర భారతి న్యూస్ ఏప్రిల్ 02 డాక్టర్ ఏర్పుల శ్రీనివాస్):** జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ ను కాంగ్రెస్ పార్టీ ములుగు జిల్లా నాయకుడు బాదం ప్రవీణ్ మర్యాద పూర్వకంగా కలిసి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఎస్పీకి అంబేద్కర్ జయంతి సంబంధిత పోస్టర్లు అందజేసి, పోస్టర్ ఆవిష్కరణ చేశారు. కమిటీ తరపున ఎస్పీని ఏప్రిల్ 14న సాయంత్రం 4 గంటలకు ఏటూరునాగారం వై జంక్షన్ లో నిర్వహించనున్న డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలుకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానం అందజేశారు.ఎస్పి కమిటీ సభ్యులతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ డా.అంబేద్కర్ జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించడానికి అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, విద్యా ప్రాధాన్యత వంటి అంబేద్కర్ ఆదర్శాలను ప్రచారం చేయడం లక్ష్యంగా ఉందని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా వాలీబాల్ టోర్నమెంట్, సాంస్కృతిక కార్యక్రమాలు,బహుమతుల పంపిణీ, ప్రసంగాలు తదితర వేడుకలు ఏర్పాటు చేయనున్నారు.ఏప్రిల్ 14, 15, 16 తేదీల్లో వివిధ కార్యక్రమాలు జరుగుతాయని కమిటీ తెలిపింది.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షులు చిలువేరు అన్నమయ్య కార్యదర్శి వేంపల్లి శంకర్ కోశాధికారి పరికి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ లోకసభలో ఆమోదం

## హర్షం వ్యక్తం చేస్తూ తునిలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించిన ఎమ్మెల్యే దివ్య





**కోటనందూరు ఏప్రియల్ 02 వజ్రభారతి (అల్లు అప్పలకొండ):** ఆంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత లభించింది.ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టసవరణ 2026కు పార్లమెంట్ ఆమోదం లభించింది.నిన్న సవరణ బిల్లు కు లోక్ సభ ఆమోదం తెలపగా ఇవాళ ఇవాళ రాజ్యసభ సై అంది. ఇక రాష్ట్రపతి ముద్ర లాంఛనప్రాయమే.అమరావతికి చట్టబద్ధత లభించడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి కాకినాడ జిల్లా, తేటగుంట క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విఫ్ యనమల దివ్య నేతృత్వంలో అమరావతి విజయోత్సవవేడుక అట్టహాసంగా జరిగింది.ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ జరిగింది.సీనియర్ నేతలు యనమల రాజేష్,చింతంనీడి అబ్బాయి లతో కలిసి క్యాండిల్ ర్యాలీ ని యనమల దివ్య ప్రారంభించారు.ఈసందర్భంగాఆమె మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్ పునర్నిర్మాణానికి కంకణం బద్దులైన ముఖ్యమంత్రినారా చంద్రనాయుడు ప్రజల కలలరాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించారని, ఇంకా అమరావతే శాశ్వత రాజధాని అని పేర్కొన్నారు.

**కోటనందూరులో..**

తుని నియోజకవర్గ టిడిపి జనరల్ సెక్రెటరీ డాక్టర్ వెలగా కృష్ణారావు ఆధ్వర్యంలో అమరావతికి శాశ్వత రాజధానిగా పార్లమెంట్ ఉభయ సభలలో ఆమోదం లభించడంతో క్యాండిల్ ర్యాలీ నిర్వహించి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోడపాటి సత్యనారాయణ, నందిక జాన్ విక్టర్, నందిక పెద సత్యనారాయణ, కడితి చిన్న నూకరాజు, పంపన బోయిన యర్రయ్య, దార్ల గోపి, తదితరులు పాల్గొన్నారు.

### ఓస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో

# పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

### హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్





**హైదరాబాద్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 2 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** హైదరాబాదులోని ఓస్మానియా యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నాయకత్వ కార్యక్రమం ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహభరిత కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి ప్రేరణాత్మకంగా ప్రసంగించారు, మాజీ మంత్రి వారి సందేశం యువతలో కొత్త ఉత్సాహాన్ని నింపుతూ, భవిష్యత్ తరాలు లక్ష్యసాధనతో సమాజంలో ఉన్నత శిఖరాలకు ఎదిగి అనేక విజయాలు సాధించి విద్యార్థిని విద్యార్థులు కన్నా కళలను సాఫల్యం చేసుకొని మిమ్మల్ని కన్నా తల్లిదండ్రుల, మీకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయుల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు, దేశ భవిష్యత్తుకు యువతి యువకుల సంకల్ప స్ఫూర్తి అవసరమన్నారు, సమాజ సేవలో విద్యార్థి యువతీ యువకుల సేవలు స్ఫూర్తినివ్వాలి అన్నారు,ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది ఐలాపూర్ మాణిక్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ గా సమాజానికి సేవలు అందిస్తూ, భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా మహనీయుల ఆశ సాధనతో భారతదేశం గర్వించే విధంగా యువత అన్ని రంగాల్లో ముందుండేందుకు స్ఫూర్తినిస్తూ భారత రాజ్యాంగబద్ధంగా పరిపాలన దక్షతను సాధించి దేశ పరిపాలనకు స్ఫూర్తినివ్వాలని, భారతదేశ గౌరవాన్ని ఖ్యాతిని సాధించుటకు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచేందుకు నేటి విద్యార్థులు విద్యార్థులు కంకణబద్ధులై దేశ అభివృద్ధిని సాధించాలన్నారు,కార్యక్రమం సందర్భంగా విద్యార్థుల ఆలోచనలు, అభిప్రాయాలను తెలుసుకుంటూ వారిని ప్రోత్సహించారు, నాయకత్వ కార్యక్రమం ద్వారా యువతలో నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతలపై అవగాహన పెంపొందించడమే ప్రధాన లక్ష్యంగా నిలిచింది అన్నారు,ఈ కార్యక్రమం విజయవంతంగా ముగియడంలో నిర్వాహకులు, పాల్గొన్న ప్రతి ఒక్కరి కృషి ప్రశంసనీయమైంది అని తెలియజేయడం జరిగింది.

# ముథోల్ లో హటరీరాహోరీగా కుస్తీ పోటీలు

### ఘనంగా హనుమాన్ జన్మోత్సవాలు



**ముధోల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 02 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రమైన జటాశంకర్ ఆలయ ప్రాంగణంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బీసీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కుస్తీ పోటీలు హెరాహాటరీరీగా సాగాయి. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మల్లయోధులతో పాటు మహారాష్ట్రకు చెందిన మల్లా యోధులు పాల్గొన్నారు. మల్ల యోధులు చివరి వరకు నువ్వా నేనా అనే రీతిలో పోటీ పడిన తీరు చూపరులను కనువిందు చేసింది. ముఖ్యంగా చిన్నారులు సైతం కుస్తీ పోటీల్లో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చివరి కుస్తీ పోటీలో గెలుపొందిన విజేతకు ఐదు వేల నగదును అందించారు. దాదాపు మల్ల యోధులకు లక్ష వరకు నగదు బహుమతులను పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం ముథోల్ కుస్తీ పోటీలు అంటే మల్లాయోధులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.బీసీ సంఘం ఆధ్వర్యంలో వీక్షకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాటుచేశారు.ముథోల్ ఎస్సై బిట్ల పెర్సిస్ ఆధ్వర్యంలో కుస్తీ పోటీల సందర్భంగా గట్టి బందోబస్తు నిర్వహించారు. కుస్తీ పోటీలను చూడడానికి యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ షబానా బేగం ఏజాజొద్దీన్, బీసీ సంఘం అధ్యక్షుడు విట్టల్ , ఉపాధ్యక్షుడు నగేష్, కోశాధికారి వెంకటేష్,దశరథ్, ఉప సర్పంచ్ కోరి లావణ్య సాయినాథ్,మున్నూరు కాపు సంఘం తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేష్, బిజెపి మండల అధ్యక్షుడు కోరిపోతన్న, సంఘం సభ్యులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



## ముధోల్ నియోజకవర్గం లో ఘనంగా హనుమాన్ జన్మోత్సవాలు

### పలు గ్రామాల్లో ఆకట్టుకున్న రోటి పండగ

**నిర్మల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 2 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లాలోని ముధోల్ నియోజకవర్గంలో పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉట్టికొట్టే సంబరాలు గ్రామాల్లో మిన్నంటాయి. మరికొన్ని గ్రామాల్లో కుస్తీ పోటీలను కూడా నిర్వహించడం జరిగింది. హనుమాన్ జన్మ ఉత్సవం సందర్భంగా అభిషేకాలు సింధూరపు తైలాలతో హనుమాన్ విగ్రహాలను శోభయమానంగా అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రజలు పండగను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దాదాపు అన్ని గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. మరికొన్ని గ్రామాల్లో రోటి పండుగను నిర్వహించి పొడవాటి కర్రకు సింధూర తైలంతో పుట్టిని కట్టి ఎక్కిన వారికి బహుమతుల ప్రధానం కూడా చేయడం జరిగింది. దీనిని తిలకించడానికి గ్రామ వాసులు ఎంతో ఉత్సాహభరితంగా ప్రతి గ్రామంలో పాల్గొనడం విశేషం. ముధోల్ మండలం తో పాటు తానూర్, కుబీర్, కుంటాల, లోకేశ్వరం మండలాలలో ఘనంగా ఈ కార్యక్రమాలను నిర్వహించారు ముధోల్ మండలం కేంద్రంలోని జటా శంకర్ ఆలయంలో స్థానిక ఎస్సై బిట్ల పెర్సెంట్ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలను నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో పాల్గొనడానికి మహారాష్ట్ర నుంచి మల్ల యోధులు రావడం విశేషమని ప్రజలు తెలియజేశారు.

తానూర్ మండలంలో కూడా ఘనంగా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది.





# నిర్మల్ జిల్లాలో ఘనంగా అత్యవసర వైద్య సిబ్బంది దినోత్సవం

### ప్రజలకు ప్రాణాధారం 108 సిబ్బంది

**నిర్మల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 02 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లాలో అత్యవసర వైద్య సిబ్బంది దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.108 అంబులెన్స్ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వాహన చోదకులు అలాగే ఇతర సిబ్బంది పాల్గొని ప్రజలకు అందిస్తున్న సేవల ప్రాముఖ్యతను వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఉచిత వైద్య సేవలను అందిస్తూ 108 అంబులెన్స్ సేవలు సమాజానికి ప్రాణాధారంగా నిలుస్తున్నాయని అధికారులు తెలిపారు.పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రమాదాలు, గుండెపోటు, మెదడు సంబంధిత వ్యాధులు, గర్భిణీ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించి అనేక ప్రాణాలను కాపాడుతున్నట్లు వెల్లడించారు.సంఘటనా స్థలంలోనే ప్రాథమిక చికిత్స అందించి బాధితులను స్థిరపరిచి సమీప ఆసుపత్రులకు తరలించడం ద్వారా అత్యవసర వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు.ముఖ్యంగా ప్రమాదాలు జరిగిన వెంటనే సమయానికి చికిత్స అందించడం వల్ల అనేక ప్రాణాలు రక్షించబడుతున్నాయని తెలిపారు.జిల్లాలో గత ఒక సంవత్సరంలో మొత్తం 31,977 అత్యవసర ఘటనలకు 108 అంబులెన్స్ సేవలు అందించాయని అధికారులు తెలిపారు. ప్రమాద బాధితులు, గర్భిణీలు,గుండె, ఇతర అత్యవసర వ్యాధులతో బాధపడుతున్న వారికి సమయానుకూలంగా వైద్య సహాయం అందించడంతో వేలాది మంది లబ్ధి పొందినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, అత్యవసర కాల్ వచ్చిన వెంటనే కొద్ది నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుని అవసరమైన చికిత్స అందించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా వెంటనే 108 సేవలను సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో నిర్వాహక అధికారి జనార్ధన్ మాట్లాడుతూ, జిల్లాలో 108 అంబులెన్స్ సేవలు ప్రజలకు అత్యంత అవసరమైన సమయంలో ప్రాణాధారంగా నిలుస్తున్నాయని అన్నారు. అత్యవసర వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేస్తూ అనేక ప్రాణాలను కాపాడుతున్నారని తెలిపారు.అత్యవసర వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, కేంద్రంగా అభివృద్ధి చేస్తాం:

### గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు:

### ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి:

### రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు.



**బాసర వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 02 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లాలోని బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక ఆహ్లాదక కేంద్రాలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. ఏప్రిల్ 6న బాసర ఆలయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రానున్నందున, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి ఆయన సమీక్షించారు.ముందుగా పలు నిర్మాణాలు చేపట్టబోయే ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పలు నిర్మాణాలకు సంబంధించి శంకుస్థాపనలు చేసే ప్రాంతాలను చూశారు. పనుల ప్రారంభోత్సవాల ఏర్పాటుకు సంబంధించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. అనంతరం ఆలయంలో ముఖ్యమంత్రి నిర్వహించు పూజలకు సంబంధించి వివరాలను చర్చించారు.ఆ తర్వాత దేవాలయ కార్యనిర్వహణ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి పకడ్బందీగా ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. బాసర ఆలయానికి దేశవ్యాప్తంగా ఎంతో చారిత్రాత్మక ప్రశస్తి ఉందని, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ముఖ్యమంత్రి బాసర పర్యటన సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారని వివరించారు. బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా సకల వసతులను కల్పిస్తామని పేర్కొన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అన్నారు. రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పుష్కర ఘాట్ మరమ్మత్తు, నూతన పుష్కర ఘాట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇప్పటి నుంచే అవసరమైన మౌలిక సదుపాయాల నిర్మాణ పనులను ప్రారంభించాలని అన్నారు.జిల్లాలో పుష్కరాల నిర్వహణకు సంబంధించి వివరాలన్నింటినీ ఎప్పటికప్పుడు స్వయంగా సమీక్షిస్తానని వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. ఆయా శాఖలకు సంబంధించి అధికారులు నిర్వర్తించాల్సిన బాధ్యతలపై సంబంధిత ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే రానున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి బాసరలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు,ఇతర అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ-గ్రామ సమస్యలపై వాడివేడిగా చర్చలు

### గుమ్మడిదల మండల వ్యాప్తంగా గ్రామసభలు

### అన్నారం గ్రామ పంచాయతీ గత పది సంవత్సరాల చిట్టా పద్దులు కావలి

### కౌన్సిలర్ బెంబిడి సంజీవరెడ్డి




**గుమ్మడిదల మున్సిపల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 02 రాష్ట్ర బ్యూరో:** సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాసమస్యలపై గురువారం గ్రామసభలు, వార్డు సమావేశాలు నిర్వహించారు. మున్సిపాలిటీ కేంద్రంతో పాటు అన్నారం, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు పట్టణాల్లో సమావేశాలు జరగగా, మండలంలోని నల్లవల్లి, కానుకుంట, మంభాపూర్, అనంతారం, రాంరెడ్డిబావి, వీరారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు.ఈ సమావేశాల్లో ప్రధానంగా తాగునీటి కొరత, పారిశుద్ధ్య సమస్యలు, మౌలిక వసతుల లోపాలపై ప్రజలు వాడివేడిగా చర్చించారు. అన్నారం గ్రామంలో 261 సర్వే నంబర్ ప్రాంతం ఇందిరమ్మ కాలనీలో సరైన భూమి పత్రాలు లేకుండా ఇండ్ల నిర్మాణాలకు మున్సిపాలిటీ ఏర్పాటుకు ముందు జీపీ కార్యదర్శులు అనుమతులు ఇచ్చిన విషయంపై తీవ్ర చర్చ జరిగింది.8వ వార్డు కౌన్సిలర్ బెంబిడి సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో ఇష్టానుసారంగా ఇచ్చిన ఇంటి నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత పది సంవత్సరాల కాలంలో అప్పటి సర్పంచులు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని కొందరు అభిప్రాయపడ్డారు.అలాగే 261 సర్వే నంబర్లో పేద రైతులకు ఇచ్చిన ఎకరా భూముల పట్టాలకు పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో పాటు ఆన్లైన్లో నమోదు లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సమావేశంలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి రెవెన్యూ అధికారులు హాజరుకాకపోవడాన్ని ప్రజలు తప్పుబట్టారు. మున్సిపాలిటీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలకు విధిస్తున్న పన్నులను తగ్గించాలని కూడా డిమాండ్ చేశారు.బొంతపల్లిలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అందడం లేదని, వీధి దీపాలు, పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని బీఆర్ఎస్ నాయకుడు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి సమావేశంలో ప్రస్తావించారు.ఈ సందర్భంగా వార్డు అధికారులు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్లకు ఆరు నెలలకు ఒకసారి ఇంటి పన్నులు చెల్లించాలని, లేకపోతే బకాయి పన్నులపై వడ్డీ విధించబడుతుందని తెలిపారు.మండలంలోని గ్రామాల్లో ఎంపీడీవో ఉమాదేవి పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించగా, మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రజలు తమ సమస్యలను వెల్లడించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ప్రజలు కోరారు.ఈ కార్యక్రమాల్లో మున్సిపాలిటీ చైర్మన్ కుమార్ గౌడ్, కమిషనర్ దశరథ్, కౌన్సిలర్లు పాల్గొనగా, గ్రామాల్లో సర్పంచులు, పాలకవర్గ సభ్యులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# బి.ఆర్.ఎస్ పార్టీ యువ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ జన్మదిన వేడుక

### మాణిక్ యాదవ్ ను ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన... మాజీ మంత్రి హరీష్ రావు





**హైదరాబాద్ వజ్ర భారతి న్యూస్ ఏప్రిల్ 02 రాష్ట్ర బ్యూరో (డా.ఏర్పుల శ్రీనివాస్):** సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మున్సిపల్ ఐలాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ హైకోర్టు న్యాయవాది బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ యువ నాయకుల జన్మదిన వేడుకల సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు అందుకున్నారు.ఈ సందర్భంగా పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని కలిసి,ఆయన సంపూర్ణ ఆశీస్సులు అందుకోవడం జరిగింది, పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఐలాపూర్ మాణిక్ యాదవ్ ను ఘనంగా సన్మానించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజా సేవలో మరింత చురుగ్గా కొనసాగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదిస్తూ ఆకాంక్షించారు. అనంతరం మాజీ మంత్రివర్యులు, ప్రముఖ తెలంగాణ ఉద్యమం సారధి ప్రముఖ రాజకీయ స్ఫూర్తి నాయకులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ని మర్యాదపూర్వకంగా కలవడంతో, మాజీ మంత్రిహరీష్ రావు ప్రత్యేకంగా ఆహ్వానించి పుట్టినరోజు సందర్భంగా అభినందించి, భవిష్యత్తు రాజకీయ ప్రస్థానానికి తన సంపూర్ణ మద్దతు, దీవెనలు ఉంటాయని ఆశీర్వదించి ఆత్మస్థైర్యాన్ని ఇస్తూ ప్రముఖ ఉద్యమ నాయకుడిగా సమాజంలో పేరు ప్రతిష్టలు సాధిస్తున్నందుకుగాను పార్టీ ఎల్లప్పుడు నీ వెన్న అంటూ ఉంటుందని వారి సేవలను అభివర్ణిస్తూ మాణిక్ యాదవ్ ను గుండె కట్టుకొని కౌగలింతతో మరోసారి నేనున్నాను నీ వెంట అని ప్రగాఢ విశ్వాసాన్ని తెలియజేశారు, అనంతరం ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ నా జన్మదిన సందర్భంగా ప్రముఖ తెలంగాణ ఉద్యమ నాయకులు ప్రజా ఉద్యమ స్ఫూర్తి మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి, పటాన్చెరు బి ఆర్ ఎస్ పార్టీ తాలూకా ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, పలువురు టిఆర్ఎస్ రాష్ట్ర జిల్లా తాలూకా మండల గ్రామాల నాయకులు నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఆశీర్వదించినందుకు వీరందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, బి ఆర్ ఎస్ పార్టీ యువ నాయకుడిగా బి ఆర్ ఎస్ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్న నాకు సంపూర్ణ ఆశీర్వాదాన్ని అందించి మరింత ముందుకు వెళ్ళుటకు సహకరిస్తున్న మీ అందరికీ మరోసారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను, మీ అందరి సహకారాలు అందిస్తూ నా వెన్న అంటూ ఉంటూ నేను తల పెట్టే ప్రజా శ్రేయస్సు ఉద్యమాలకు సంపూర్ణ సహకారనందించి విజయం సాధించే దిశగా ఆశీర్వదించాలని అన్నారు,ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై, ఐలాపూర్ మాణిక్ యాదవ్ కి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని కొనియాడారు.



# కుబీర్ లో ఘనంగా శ్రీ వీర హనుమాన్ జన్మోత్సవాలు

### ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరూ కలిసిమెలిసి నిర్వహించుకోవాలి

### కార్యక్రమంలో పాల్గొన్న ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

**కుబీర్ వజ్రా భారతి న్యూస్ ఏప్రిల్ 02 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించిన శ్రీ వీర హనుమాన్ జన్మోత్సవ శోభాయాత్ర కార్యక్రమానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శోభాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి శ్రీ హనుమాన్ స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ,హనుమాన్ స్వామి భక్తి, శక్తి, ధైర్యానికి ప్రతీక అని,యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని, ప్రజలలో సత్సంకల్పాలను పెంచుతాయని తెలిపారు. అలాగే మండల అభివృద్ధి కోసం, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులు అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# చిన్న ఘటనలకు మతరంగు పూస్తే కఠిన చర్యలు

### సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

### నిర్మల్, భైంసా ఇంచార్జి ఏఎస్పీ సాయి కిరణ్



**నిర్మల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 02 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లాలో జరుగుతున్నటువంటి కొన్ని సంఘటనలను ఆసరాగా చేసుకొని లేని పోనీ పుకార్లను సోషల్ మీడియాలో పెట్టి ప్రజల శాంతి భద్రతలకు విఘతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని,తాగిన మైకం లో వ్యక్తుల మధ్య జరిగే చిన్నపాటి గొడవలు, చిల్లర తగాదాలు, సాధారణ రోడ్డు ప్రమాదాలు వంటి ఘటనలకు కావాలని కొంత మంది ఆకతాయిలు మత రంగు పూసే ప్రయత్నం చేస్తున్నారని,ఇటువంటి చర్యలు ప్రజల మధ్య అనవసరమైన ఉద్రిక్తతలు, విద్వేషాలను సృష్టించ డానికి ప్రయత్నిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని అంతేకాకుండా సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేయడం,సంఘటనలను వక్రీకరించి మతపరమైన కోణంలో చూపించడం వంటి చర్యలను కఠినంగా పరిగణిస్తామని నిర్మల్ జిల్లా పోలీస్ హెచ్చరిస్తోంది.ఇటువంటి పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తుంది.ఈ సందర్భంగా నిర్మల్, భైంసా ఇంచార్జి ఏఎస్పీ సాయి కిరణ్ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా నిజానిజాలను తెలుసుకుని బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, అనుమానాస్పద విషయాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



# ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరవేయడమే ప్రజాపాలన- ప్రగతి నివేదిక

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్ వజ్రభారతి న్యూస్ ఏప్రిల్ 2 జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నిర్మల్ జిల్లా ప్రజాపాలన – ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బుధవార్ పేట్‌లో నిర్వహించిన వార్డు సభకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గీతం ఆలపించి ఘనంగా ప్రారంభించారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశాన్ని మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ సభలో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు సంక్షేమ పథకాల లబ్దిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అప్పాల కావ్య, వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, అధికారులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్మల్ గ్రామీణ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో గురువారం నిర్వహించిన గ్రామసభకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు విధానంపై వివరించారు. ప్రజలు ప్రభుత్వ పథకాల ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమని తెలిపారు. ఈ గ్రామసభలో డిపిఓ శ్రీనివాస్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ వనిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.






# చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి
# వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు. ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పొంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

## హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో

దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది.

# ఆ స్టార్ డైరెక్టర్‌తో మరోసారి ..
# హిట్ మూవీకి సీక్వెల్ రానుందా



మంగాత్తా చిత్ర కాంబో రిపీట్ కానుందా? అంటే కోలీవుడ్‌లో అవుననే టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరో అజిత్, దర్శకుడు వెంకట్ ప్రభులది హిట్ కాంబినేషన్ అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరి కాంబోలో 2010లో తెరకెక్కిన మంగాత్తా చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. ఆ చిత్రంలో నటుడు అజిత్‌ను విలనిజంతో కూడిన స్టైలిష్ పాత్రలో చూపించి సక్సెస్ అయ్యారు డైరెక్టర్. దీంతో వీరి కాంబినేషన్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం ఇప్పుడు రానుంది. దర్శకుడు వెంకట్ ప్రభు.. శివకార్తికేయన్ హీరోగా చిత్రం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని నటుడు శివకార్తికేయన్ కూడా తెలిపారు. అయితే ఈ చిత్రం ప్రారంభంలో ఆలస్యం జరగనున్నట్లు తెలిసింది. దీంతో దర్శకుడు వెంకట్ ప్రభు ఇటీవల నటుడు అజిత్‌ను కలిసి కథ వినిపించినట్లు సమాచారం. అది ఆయనకు నచ్చడంలో అందులో నటించడానికి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. కాగా అజిత్ 2027 జనవరి వరకు చిత్రాల్లో నటించనని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆయన 64వ చిత్రాన్ని గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం ఫేమ్ ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో నటించనున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో వెంకట్ ప్రభు దర్శకత్వంలో అజిత్ నటించే చిత్రం ఎప్పుడు ప్రారంభం అవుతుంది? దానికి సంబంధించిన వివరాలు ఏమిటి? అన్నది తెలియాలంటే మరికొద్ది కాలం ఆగాల్సిందే. ఇకపోతే ఇది మాంగాత్తాకు సీక్వెల్‌గా ఉంటుందా? లేక కొత్త కథా చిత్రంగా ఉంటుందా? అనే ఆసక్తి నెలకొంది.

# జోడీ కుదిరింది

సల్మాన్ ఖాన్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా రానుందని, ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సల్మాన్ ఖాన్ సరసన నయనతార నటించడం దాదాపు ఖరారైయిందని, కథ నచ్చి ఆమె ఒప్పుకున్నారని సమాచారం. ఈ జోడీ గురించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట. ఇక ఈ సినిమా చిత్రీకరణను ఏప్రిల్ చివర్లో ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. మరోవైపు ప్రస్తుతం సల్మాన్ 'మాతృభూమి' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.





Printed, Published, Edited & Owned by PAMMI YEDUKONDALU, Published From Door No. 2-2-14, 13th Ward, Komaravaram Road, TANUKU -534 211 West Godavari Dt., A.P., Printed at SRI SATYA OFFSET PRINTERS, Venkatrama Theater Street, TADEPALLIGUDEM - 534 102, West Godavari Dt., A.P. Editor : PAMMI YEDUKONDALU